J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 34 23.1.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ప్రభుత్వ తొందరపాటు.. అధికారుల అత్యుత్సాహం

# తప్పుల తడకలుగా పాస్‌బుక్‌ల పంపిణీ



- జగన్ బొమ్మ తొలగింపునకే ప్రాధాన్యత
- గత ప్రభుత్వ తప్పులను సవరించకుండానే కొత్త పాస్‌బుక్‌ల జారీ
- లబోదిబోమంటున్న రైతన్నలు

ఆలోచన మంచిదైనా.. ఆచరణ గాడితప్పితే చేసేపనికి సార్థకత చేకూరదని పెద్దలంటారు. కూటమి ప్రభుత్వం జారీచేస్తున్న కొత్త పాస్‌బుక్‌ల ప్రక్రియకు ఈ సూక్తి సరిగ్గా సరిపోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత పాలకుల నిర్వాకంలో తప్పుల తడకలతో పాసుపుస్తకాలని అందుకుని సతమవుతున్న రైతులు, కూటమి ప్రభుత్వమైనా న్యాయం చేస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే, అసలు సమస్యలను అలాగే ఉంచి జగన్ ఫొటోను తొలగించేందుకు మాత్రమే అధికారులు ప్రాధాన్యత ఇస్తుండడంతో కొత్త పాస్‌బుక్‌ల వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

2లో







## మాయాజూదంగా మీడియా రంగం

# బాధ్యత ఒకరిది.. బాధలు మరొకరివి!

- వార్త ప్రచురణకు బాధ్యులెవరు?
- యాజమాన్యమా.. రిపోర్టర్‌లా?
- కొత్తవాదనను తెరపైకి తెచ్చిన జర్నలిస్టుల అరెస్టులు

దేశంలో ప్రెస్ అంటే ప్రైస్‌గా మారిందని, న్యూస్ కంటే న్యూసెన్స్ ఎక్కువైందని, మొత్తంగా మీడియా అంటేనే బెదిరింపులకు పాల్పడే మాఫియా అన్న అభిప్రాయం ప్రస్తుతం సమాజంలోని అన్ని వర్గాల నుండి వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగు మూలస్తంభాలలో ఒకటైన మీడియా రంగం స్వార్థపూరిత పోకడలతో అభాసుపాలవుతోంది. అయితే రోజూ పుంఖానుపుంఖాలుగా వార్తలను వండివార్చే మీడియారంగంలో, అసలు వార్తకు బాధ్యత ఎవరిది? దాని పర్యవసానాల బాధలెవరివి? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతోంది.

2లో...



# తప్పుల తడకలుగా పాస్‌బుక్‌ల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్ర్యం తర్వాత భూముల రీసర్వే చేస్తున్న ప్రభుత్వం మాదే అంటూ గతంలో వైఎస్ జగన్ సర్కారు పెద్దఎత్తున డప్పు కొట్టింది. సర్వేలో ఖచ్చితత్వం కోసం డ్రోన్లు, అత్యాధునిక పరికరాలు ఉపయోగిస్తున్నామంటూ ప్రచారం చేసుకుంది. అంతేకాక ఏకంగా పాస్‌బుక్‌లపై తాటికాయంత సైజుతో జగన్ బొమ్మను ముద్రించింది. చివరికి సర్వేరాళ్లపై కూడా జగన్ ఫొటోలు వేసి ఇష్టారాజ్యంగా వ్యవహరించింది. దీంతో సగటు రైతు జగన్ సర్కారు తీరుపై విసిగివేసారి పోయారు. దీనికితోడు ఆమ్యామ్యాలకు అలవాటు పడిన రెవెన్యూ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు తమ అనుయాయులకు లబ్ధి చేకూర్చే క్రమంలో తప్పులపై తప్పులు చేస్తూ పాస్‌బుక్‌ల జారీని స్వార్థపూరిత రాజకీయ ప్రహసనంగా మార్చేశారు. సరిగ్గా ఇలాంటి సమయంలోనే కూటమిగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలు తాము అధికారంలోకి వస్తే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తామని, పాస్‌బుక్‌లపై జగన్ బొమ్మలను తొలగించి రాజముద్రతో కొత్త పాస్‌బుక్‌లు ముద్రించి రైతులకు న్యాయం చేస్తామంటూ హామీ ఇచ్చారు. పైగా ఎన్నికల ప్రచార సభల్లో జగన్ బొమ్మతో ముద్రించి ఇచ్చిన పాస్‌బుక్‌లను ప్రజల ఎదుటే చించేసి మరీ అన్నదాతలకి భరోసా కల్పిస్తామంటూ చంద్రబాబు వాగ్దానం చేశారు. ఎన్నికల అనంతరం కూటమి పార్టీలు బంపర్ మెజారిటీతో అధికారంలోకి రావడంతో తమ భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారం అవుతాయని రైతులంతా భావించారు. అయితే ప్రభుత్వ తొందరపాటు, అధికారుల అలసత్వం, నాయకుల పర్యవేక్షణా లోపం కారణంగా భూ సమస్యలు పరిష్కారం కాకపోగా మరింతగా ఎక్కువయ్యాయన్న ఆందోళన రైతన్నల నుండి వ్యక్తమవుతోంది.

## పాత తప్పులతోనే కొత్తగా!

కొత్త సంవత్సరంలో రాష్ట్రంలోని రైతులందరికీ న్యాయం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం జనవరి ప్రారంభంలో కొత్త పాస్‌బుక్‌ల జారీ ప్రక్రియను ప్రారంభించింది. ఈమేరకు స్థానిక వీఆర్ఓతో పూర్తిస్థాయిలో ఈకేవైసీ చేయించి ట్యాంపరింగ్‌కు అవకాశంలేకుండా క్యూఆర్ కోడ్‌తో, రాష్ట్రచిహ్నాన్ని ముద్రించి మరీ పాక్‌బుక్‌లు ఇవ్వాలని తన ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది. ఈక్రమంలో గత ప్రభుత్వం ప్రచారయావతో వేసుకున్న అప్పటి అధినాయకుడి బొమ్మ తొలగిస్తామన్నారు. తప్పులన్నింటినీ సవరిస్తామని చెప్పారు. అన్ని వివాదాలను గ్రామసభల సాక్షిగా అధికారుల సమక్షంలో శాశ్వతంగా పరిష్కరిస్తామంటూ ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారు.

ఇంత వరకు బాగానే ఉన్నా, అసలు సమస్య ఇక్కడే ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 6,688 గ్రామాల్లో వెబ్‌ల్యాండ్‌లోని వివరాల ఆధారంగా 21.80 లక్షల కొత్త పాస్‌బుక్‌ల జారీకి రెవెన్యూ అధికారులు శ్రీకారం చుట్టారు. రెవెన్యూ అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేసి, ప్రజాప్రతినిధుల సమక్షంలోనే వాటిని రైతులకు అందించారు. పైగా కొత్త పాస్‌బుక్‌ల జారీకి ఎవరూ నగదు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే ఉచితంగా పాస్‌బుక్‌లను అందజేస్తుందని కూడా ప్రకటించారు. కానీ గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న యజమానుల పేర్ల మార్పు, ఆధార్, ఫోన్‌నంబర్ల మార్పు, ఫొటోల మార్పు, విస్తీర్ణంలో లోపాలు వంటి అంశాలని పట్టించుకోలేదు. గతంలో జరిగిన తప్పులని ఆన్‌లైన్‌లో సవరించుకునే సౌలభ్యం కానీ లేదా నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కానీ రైతు సోదరులకు కల్పించలేదు. జగన్ బొమ్మ తొలగించి రాజముద్రతో కొత్తవి అందించడమే ప్రధాన లక్ష్యం అన్న తరహాలో పాస్‌బుక్‌ల పంపిణీ ప్రక్రియని కొనసాగించారని రైతులు ఆరోపిస్తున్నారు. చాలా పుస్తకాల్లో యజమానుల ఫోటో కూడా మారిపోయిందని, సర్వే నంబర్లతో పాటు భూమివిస్తీర్ణం కూడా తగ్గడమో పెరగడమో జరిగిందని రైతులు వాపోతున్నారు. గతంలో కంటే ఘోరంగా పాస్‌బుక్ లని ముద్రించి ఇచ్చారని, అవి నాలుక గీసుకోవడానికి కూడా పనికిరావని అన్నదాతలు లబోదిబోమంటున్నారు.

రెవెన్యూ అధికారులు తమ వేలిముద్రలను తీసుకుని, రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకుని, కొత్త పాస్‌బుక్‌లను చేతికందించి తూతూమంత్రంగా గ్రామసభలను ముగించారని ఆరోపిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు ఇదే తంతు సాగడంతో ప్రభుత్వ పెద్దలు ఆశించిన ప్రయోజనం రైతులకు దక్కలేదనే చర్చలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో ఇకనైనా ప్రభుత్వం మేల్కొని భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించిన తర్వాతే కొత్త పాస్‌బుక్‌లను మంజూరుచేస్తే ఉపయోగకరంగా ఉంటుందని అన్నదాతలు సూచిస్తున్నారు. లేకుంటే అదనంగా చేకూరే లబ్ధి దక్కకపోగా, కొత్తసీసాలో పాతసారా అన్నట్లుగా పరిస్థితి తయారవుతుందని వాపోతున్నారు. అలాంటి దుస్థితి రాకముందే చంద్రబాబు ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుని పాస్‌బుక్‌ల జారీలో మరింత పారదర్శకత, నిబద్ధత పాటించాల్సిన అవసరం చాలావుంది. లేదంటే రైతు పరిస్థితి పెనంపై నుండి పొయ్యిలో పడ్డట్లే...!

### 58 ఏళ్ళ రైతు ఫోటోకి బదులుగా మూడేళ్ళ పసికందు ఫోటో




నెల్లూరుజిల్లా, వెంకటాచలం మండలం, కంటేపల్లి గ్రామంలో పొలం ఉన్న ఓ రైతుకి ఇచ్చిన పాస్‌బుక్‌లో ఆయన ఫోటోకి బదులుగా పసికందు ఫోటో ఉండడమే కాకుండా, సదరు రైతు ఫోన్ నెంబరు, ఆధార్ నెంబరు కూడా తప్పుగా ముద్రితమయ్యాయి. ఆయన పొలం విస్తీర్ణం కూడా తప్పుగానే వచ్చింది.

**2019కి ముందు ఇచ్చిన పాస్‌బుక్‌లో అన్నీ సవ్యంగానే ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే జరిపి ముద్రించిన పాస్‌బుక్ ఆధారంగా ఈ కొత్త పాస్‌బుక్ ఇవ్వడంతో అన్నీ తప్పుల తడకలుగా ఉన్నాయి.**

# కన్యకా పరమేశ్వరిదేవికి..పెన్నా జలాలతో అభిషేకం

## • నిప్పుల గుండంలో నడిచిన భక్తులు



ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం శ్రీ కన్యకా పరమేశ్వరి దేవి అగ్నిగుండ ప్రవేశ మహోత్సవాన్ని ఈనెల 20న నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయం వద్ద పెన్నానది ఒడ్డున గంగమ్మ తల్లికి మహిళలు పూజలు చేసి, సంప్రదాయబద్దంగా 108 మంది గోత్రీకులు, 108 కలశాలతో పవిత్రమైన పెన్నా జలాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు..శ్రీపీఠం గురువులు శ్రీ లలితా శివకుమారస్వామి నేతృత్వంలో ప్రత్యేకపూజలు జరిగాయి. సాయంత్రం భక్తులు అనేకమంది అమ్మవారిని స్మరిస్తూ నిప్పులగుండంలో నడిచారు. అమ్మవారి ఆలయ ఛైర్మెన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షులు శేగు షణ్ముగరావుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సీఐటీయు ఆధ్వర్యంలో..

# మెగా కంటి వైద్యశిబిరం

నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఈనెల 20న సీఐటియు ఆధ్వర్యంలో, వాసన్ ఐ కేర్ సెంటర్ వైద్యుల సహకారంతో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆటోకార్మికులు అనేక మంది పాల్గొని కంటిపరీక్షలు చేయించుకున్నారు. శిబిరం నిర్వాహకులు అవసరమైన కంటి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న, సీఐటియు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు రవికుమార్, ఏఆర్ టెక్నీషియన్ ఈశ్వర్, పవన్‌కుమార్, ఆటోకార్మిక సంఘం నాయకులు రవీంద్ర, స్వర్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యత ఒకరిది.. బాధలు మరొకరివి!

(మొదటిపేజీ తరువాయి)

తాజాగా తెలంగాణలో ఒక ప్రముఖ న్యూస్ చానల్‌లో ప్రసారమైన ఓ వార్తా కథనం, చినికిచినికి గాలివానగా మారింది. అయితే, ఆ వార్తపై అంతెత్తున లేచిన కాంగ్రెస్ పాలకులు, ఆ చానెల్ సీఈఓలు, యజమానులను వదిలి, వార్త రాసిన రిపోర్టర్లు, చదివిన యాంకర్లపై కేసులు పెట్టడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈనేపథ్యంలో అసలు మీడియాలో వచ్చే వార్తలకు బాధ్యులెవరు..? అనే అంశంపై అటు ప్రజలు, ఇటు పాలకులు, మీడియా సంస్థల నిర్వాహకులు కూడా స్పష్టత కలిగి ఉండాల్సిన అవసరం కనిపిస్తోంది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో పేరెన్నిక కలిగిన ఓ చానెల్‌లో ఇటీవల ఆఫ్‌ద రికార్డ్ పేరుతో వెలువడిన ఓ కథనం ప్రకంపనలు సృష్టించింది. ఈ వార్త తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ సీనియర్ మంత్రికి, నల్గొండ జిల్లాలో పని చేసిన ఓ మహిళా ఐఏఎస్‌కి లేని సంబంధం అంటగడుతూ, వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా ఉందన్నది అక్కడి ప్రభుత్వ పెద్దలు, కేంద్ర సర్వీసు అధికారుల మాట. అయితే తప్పుడు వార్తకు సంబంధించి వివరణ అడగడమో, లేకుంటే చర్య తీసుకోవడంలో తప్పులేదు. కానీ, అసలైన సూత్రధారులను వదిలి పాత్రధారులపై కేసులు పెట్టడం, వారిని వెంటాడివేటాడి, వేధించడం మాత్రం సహేతుకం కాదనే అభిప్రాయం విశ్లేషకులు, మేధావుల నుండి వ్యక్తమవుతోంది. ఎందుకంటే ప్రస్తుతం ప్రతికల్లో కానీ, చానళ్లలో కానీ వార్తలన్నీ ఆయా యాజమాన్యాలు చెప్పినట్టే ప్రచురితమవుతాయన్న విషయం బహిరంగ రహస్యమే. అలాంటప్పుడు వార్తకు సంబంధించి సంస్థల యాజమాన్యాలను వదిలి, బ్రతుకుతెరువు కోసం పనిచేసే విలేఖరులని, న్యూస్ రీడర్లని బాధ్యులను చేయడం ఎంతవరకు సమంజసం అన్నదే జవాబు దొరకని ప్రశ్నగా మారుతోంది.

## అసలు సమస్య ఇదీ..!

గత కొన్ని దశాబ్దాలుగా తెలుగు మీడియా రంగం వర్గాలుగా విడిపోయి, తమకు నచ్చిన పార్టీలకు, నేతలకు వంతపాడడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో తమ వర్గం వారి మెప్పుపొందడం కోసం పాత్రికేయ విలువలకు పాతరేసి, హద్దులుదాటి ప్రవర్తించిన సందర్భాలు కూడా కోకొల్లలు. అయితే, ఓ కథనానికి సంబంధించి పొగడ్తలొచ్చినప్పుడు, లబ్ధి చేకూరినప్పుడు బాధ్యత తీసుకునే యాజమాన్యాలు, సమస్యలొచ్చినప్పుడు మాత్రం తమ రిపోర్టర్లపైనో, ఉద్యోగులపైనో నెట్టేసి, తాపీగా ఉండడం, తప్పించు కోవడం, ఏమాత్రం న్యాయంకాదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే రిపోర్టర్లు, సబ్‌ఎడిటర్లు, కాపీ ఎడిటర్లు కేవలం నెలజీతం కోసం పనిచేసే ఉద్యోగులు మాత్రమే. వారి మేధస్సును, తెలివితేటలను యాజమాన్యం సూచించిన విధంగా వార్తను ప్రచురించేందుకు, ప్రసారం చేసేందుకే వినియోగిస్తారు తప్ప సొంత నిర్ణయాలు తీసుకోరు. ఈ క్రమంలో ఇది రాయకూడదు, ఇది ప్రసారం చేయకూడదని యాజమాన్యానికి చెప్పే పరిస్థితి వారికి ఉండదు. అందుకే తమ యాజమాన్యం అనుసరించే సిద్ధాంతాలు, పాటించే సూత్రాల ప్రాతిపదికగా వారు కథనాలను రూపొందిస్తుంటారు. అయితే అవి ఒక్కో సందర్భంలో గతితప్పి, శృతిమించి మొదటికే మోసం తెస్తుంటాయి. అలాంటి పరిస్థితుల్లో తమ రిపోర్టర్‌లకు యాంకర్లకు బాసటగా నిలవాల్సిన బాధ్యత, ఆయా సంస్థల యాజమాన్యాలదే. కానీ కొన్ని సంస్థల నిర్వాహకులు సమస్య వచ్చినప్పుడు కలుగులో దాక్కుంటూ, రిపోర్టలను బలిపశువులను చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

తాజాగా తెలంగాణలో ప్రసారమైన వివాదాస్పద వార్తకి సంబంధించి చూస్తే, దానిని తమకి జరిగిన అవమానంగా మహిళా ఐఏఎస్‌లు భావించి తీవ్ర మనస్థాపానికి గురైనట్లు సమాచారం. మంత్రి కూడా ఇలాంటి కథనం రాయడం కంటే తనకు కొంత విషం ఇచ్చి చంపేయవచ్చు కదా, అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఐఏఎస్, ఐపీఎస్‌ల సంఘం తరపున దీనిపై చర్యలు తీసుకోవాలని కోరడం, తెలంగాణ ప్రభుత్వం కొందరు అధికారులతో సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటు చేయడం చకచకా జరిగిపోయింది. అయితే ఇదే అదనుగా తెలంగాణ పోలీసులు ఆ చానల్‌కు సంబంధించి యాజమాన్యాన్ని వదిలి, రిపోర్టరు, యాంకర్ల ఇళ్లపై దాడులుచేసి మరీ అరెస్టు చేయడం, ఈడ్చుకెళ్లడం వివాదాస్పదంగా మారింది. దీంతో వార్తల ద్వారా లబ్ధిపొంది, తద్వారా ప్రకటనల స్థాయిని పెంచుకునే మీడియా సంస్థల యాజమన్యాలు అదే వార్తలకు సంబంధించి ఇబ్బందులు ఎదురైనప్పుడు, ఆ నెపాన్ని, నేరాన్ని రిపోర్టర్లపై నెట్టేయడం ఎంతవరకూ సమంజసం అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిపై ఆయా సంస్థల యాజమాన్యాలు ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం కనిపిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం రాజకీయాలు సిద్ధాంతపరంగా కొనసాగడానికి బదులుగా, వ్యక్తిగత విద్వేషాలు ప్రాతిపదికగా సాగుతున్నాయి. అలాంటి సమయంలో తాము చెప్పింది చేసి, తాము రాయమన్నట్లు కథనాలు రాసే రిపోర్టర్లు, జర్నలిస్టులకు అండగా ఉండాల్సిన అవసరం, బాధ్యత ఆయా సంస్థల యాజమాన్యాలదే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలా కాకుండా చప్పట్లు మాకు, చీవాట్లు మీకు అన్నట్లుగా ప్రవర్తిస్తే పాత్రికేయ వృత్తిలో చేరడమే పాపమనే పరిస్థితులు ముందుందు దాపురించే అవకాశం ఉందన్నది విశ్లేషకుల భావన.

ఇక రాజ్యాంగాన్ని, చట్టాలను పూర్తిస్థాయిలో అవపోసన పట్టిన ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కూడా తప్పుడు కథనాలకు సంబంధించి ఎడిటర్లు, యాజమానులపై కేసులు పెట్టకుండా జీతానికి పనిచేసే జర్నలిస్టులను కటకటాల పాలు చేయడం సమంజసం కాదన్న చర్చ కూడా మీడియా వర్గాల్లో సాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మీడియా వ్యవస్థ కట్టు తప్పకుండా ఉండాలంటే అటు పాలకులు, ఇటు ప్రజలు, నిర్వాహకులు కూడా ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం వుంది.

ఏదేమైనా క్షక్షలు, కార్పణ్యాలు, రాజకీయం, వ్యాపారం, మీడియా సమ్మేళనంగా ముందుకు సాగుతున్న నేటి కాలంలో నిఖార్సైన జర్నలిజం విలువలు పాటిస్తూ, తమ వృత్తిని కొనసాగించడం పాత్రికేయులకు కత్తిమీద సామే అనడంలో ఎలాంటి సందేహం లేదు...!

# అన్న బాటలో.. అన్నీ తానై!



శ్రీధరన్న మాటే.. వేదంగా తమ్ముడు గిరిధర్‌రెడ్డి

## 27 కోట్లతో 240 అభివృద్ధి పనులకు శ్రీకారం

## జనవరి 24న శంకుస్థాపనలు

**రామాయణంలో అరణ్యవాసం చేసిన రాముడి వెంటే తమ్ముడు లక్ష్మణుడు కూడా అడవి బాట పట్టాడు. అయితే, నెల్లూరు రూరల్ రాజకీయంలో అన్న శ్రీధర్‌రెడ్డి అనారోగ్యంతో ప్రకృతి చికిత్సాలయంలో వున్నా, నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపించడంలో మాత్రం ఆయన తమ్ముడు గిరిధర్‌రెడ్డి తన అన్న చూపిన అభివృద్ధి బాటలో నడుస్తూ ఆయన ఆశయ సాధన కోసం తపిస్తున్నాడు.**

నెల్లూరురూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్వల్ప అనారోగ్యంతో కేరళ రాష్ట్రం కోటక్కల్‌లోని ప్రకృతి చికిత్సాలయంలో వైద్యం చేయించుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ విషయం స్వయంగా ఆయనే ప్రకటించారు కూడా. తాను ఒక నెలరోజుల పాటు అందుబాటులో ఉండనని, నియోజకవర్గ బాధ్యతలు తన తమ్ముడు గిరి చూసుకుంటాడని కూడా శ్రీధర్‌రెడ్డి ప్రకటించాడు.

ఈ క్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి 27 కోట్ల రూపాయలతో 240 అభివృద్ధి పనులని చేపట్టడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. జనవరి 24వ తేదీ శనివారం అందుకు ముహూర్తం కూడా పెట్టుకున్నారు. ఆరోజు ఉదయం 8గంటలా 34నిముషాలకి అన్ని పనులకి ఒకే సమయంలో శంకుస్థాపనలు చేయబోతున్నట్లు గిరిధర్‌రెడ్డి మీడియా సమావేశంలో ప్రకటించారు. రూరల్ పరిధిలోని 26 డివిజన్లలో ఈ అభివృద్ధి జాతర జరగనున్నట్లు గిరిధర్‌రెడ్డి చెప్పారు. ఈ పనులన్నిటినీ 60 రోజుల్లో పూర్తిచేసి ఒకేరోజు ఒకే సమయంలో ప్రారంభోత్సవం కూడా చేస్తామని గిరి ప్రకటించారు. ఈ పనులన్నింటికీ రూరల్ నియోజకవర్గ ప్రజలే శంకుస్థాపనలతో పాటు ప్రారంభోత్సవాలు కూడా చేస్తారని చెప్పారు.

ఇప్పటికే రూరల్ నియోజకవర్గంలో 340 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 339 పనులకి గత ఏడాది మే నెలలో శంకుస్థాపన చేసి 60 రోజుల్లోనే వాటిని పూర్తి చేశామని చెప్పారు. తన అన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదేశాల ప్రకారం, ఆయన నాయకత్వంలో ఈ పనులన్నీ చేస్తున్నామని, రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర నాయకులకి, జిల్లా నేతలకి స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కార్యకర్తలకి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియచేస్తున్నానని అన్నారు.



## అరుదైన కలయిక..!

హైదరాబాదులో జరిగిన ఓ ప్రయివేటు కార్యక్రమంలో సినిమా దిగ్గజాలు సూపర్ స్టార్స్ నాగార్జున, చిరంజీవి, వెంకటేష్‌లతో మన నెల్లూరీయుడైన వ్యాపార దిగ్గజం ఏఎంఆర్ సంస్థ అధినేత ఆల్తూరు మహేష్‌రెడ్డి.

## మన కలెక్టర్ హిమాన్షుశుక్లాకి

# ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు



ఎన్నికల నిర్వహణలో సమర్థత, పారదర్శకతకు నిలువెత్తు ఉదాహరణగా నిలిచిన హిమాన్షు శుక్లాకి రాష్ట్రస్థాయిలో గౌరవం దక్కింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా ఎన్నికల అధికారి (DEO)గా విధులు నిర్వహిస్తున్న హిమాన్షు శుక్లాను 'బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డు-2025'కు ఎంపిక చేశారు.

ఓటర్ల జాబితాల శుద్ధి కార్యక్రమం(SIR)లో నెల్లూరు జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం ఈ అవార్డుకు ప్రధాన కారణంగా నిలిచింది. ప్రతి అర్హుడికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన విస్తృత అవగాహన కార్యక్రమాలు, ఇంటింటి పరిశీలన, డేటా ఖచ్చితత్వంపై ప్రత్యేకదృష్టి పెట్టడం ద్వారా ఎన్నికల యంత్రాంగాన్ని సమర్థంగా నడిపించారు.

జనవరి 25, 2026న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును హిమాన్షు శుక్లా అందుకోనున్నారు. ఎన్నికల ప్రక్రియను అంకితభావంతో, నమ్మకంగా, సమర్థవంతంగా నిర్వహిస్తే ఫలితం ఎలా ఉంటుందో నెల్లూరుజిల్లా చూపించిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా కలెక్టర్‌కి 'లాయర్' అభినందనలు.



## శ్రద్ధాంజలి

ఆత్మీయదీప్తి, అనురాగమూర్తి
మా ఇంటి దీపం, మా పెద్దదిక్కు మా అమ్మ

### శ్రీమతి అంపజాలం ప్రభావతమ్మ

(లేట్ అంపజాలం పెంచలరాఘవరాజు గారి సతీమణి)

జనవరి 15వ తేదీ, గురువారం మధ్యాహ్నం దైవసాన్నిధ్యం పొందారు.
వారి పవిత్ర ఆత్మకి సద్గతి చేకూరాలని ప్రార్థిస్తూ...

కుమారులు :
అంపజాలం శ్యామ్‌కుమార్
అంపజాలం నారాయణ
అంపజాలం సాయికుమార్

కుమార్తె :
దక్షరాజు రాజ్యలక్ష్మి
మరియు కోడళ్ళు, అల్లుడు,
మనుమరాళ్ళు, మనుమళ్ళు

**పెద్దకర్మ :**

వారి పెద్దకర్మ 2026, జనవరి 25వ తేదీ ఆదివారం జరుగును.
కావున బంధుమిత్రులకి తెలియజేయడమైనది.

కార్యక్రమములు :

- శాంతి పూజ: ఉదయం 11.30 నుండి
- వేదిక : మా స్వగృహం, విల్లా నెం. 60, లా పలోమా విల్లాస్, మోకిల, హైదరాబాదు - 501 203.
- ఆధ్యాత్మిక సంకీర్తనలు : ఉదయం 12.00 గంటల నుండి
- సహపంక్తి : మధ్యాహ్నం 12.30 గంటలకి
- వేదిక : క్లబ్‌హౌస్, లా పలోమా విల్లాస్.

లాయర్
జనవరి 23, 2026

# రోడ్డు భద్రతపై నిర్లక్ష్యం.. ప్రాణాలకే ప్రమాదం!

'రోడ్డు భద్రత..అందరి బాధ్యత' అనే మాట నూటికి నూరుపాళ్లు వాస్తవం. ఎందుకంటే, అది ఏ ఒక్కరి వల్లనో జరిగేది కాదు. వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా, సురక్షిత ప్రయాణం జరగాలంటే ఎన్నో అనుకూలతలుండాలి. రోడ్లు బాగుండాలి. వాహనదారులు మెళకువగా వాహనాలు నడపాలి. రోడ్డు నిబంధనలను పాటిస్తూ, అటు తమకు..ఎదుటివారి వాహనాలకు ముప్పు రాకుండా చూసుకోవాలి. రోడ్డు భద్రత అంటే అది రోడ్డు గురించి కాదు..మన భద్రతే అన్నది గమనించాలి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లపై వాహనాల వారు నియమ నిబంధనలను అసలు పట్టించుకోవడం లేదని, అంతేకాక, నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడుపుతూ ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారని తాజాగా కేంద్ర రహదారులు-రవాణా మంత్రిత్వశాఖ తమ నివేదికలో వెల్లడించింది. ఆ నివేదికలో ఎన్నో ఆందోళనకరమైన అంశాలను కూడా కేంద్రం బహిర్గతం చేసింది. ఏపీలోని 1.8 కోట్ల వాహనాల్లో దాదాపు 80 శాతం వాహనాలు బీమా, కాలుష్య నియంత్రణ, ఫిటెనెస్ సర్టిఫికెట్లు వంటివేమీ లేకుండానే తిరిగేస్తున్నాయట. ప్రధానంగా ద్విచక్రవాహనదారులు నిబంధనలను  అస్సలు పట్టించుకోవడం లేదని, దీంతో ఏపీలో జరిగే రోడ్డుప్రమాదాల్లో 35 శాతం బాధితులు ద్విచక్రవాహనదారులేనని ఆ నివేదిక స్పష్టం చేసింది. అంతేకాదు, ప్రతి ఏటా జరుగుతున్న ప్రమాదాల్లో సగటున 2500 నుంచి 2,800 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నది కూడా మోటారు సైకిళ్లు, స్కూటర్లను నడుపుతున్నవారేనని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది కూడా. మోటారు వాహనాల చట్టం ప్రకారం వాహనాలకు బీమా తప్పనిసరి. ప్రమాదాలకు గురైనప్పుడు బీమా లేకుంటే, బాధితులకు పరిహారం అందే అవకాశం ఉండదు. రెండు మూడు వాహనాలున్నవారైతే, అసలు తమ వాహనాలకు బీమా చేయించాలన్న ఆలోచనే ఉండడం లేదని, ఇలా అన్నివిధాలుగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనేది సారంశం. అందులోనూ ఇటీవలికాలంలో ఆంధ్రాలో వాహనాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయింది. 2014లో 70 లక్షల వాహనాలు మాత్రమే ఉంటే, 2024 నాటికే ఆ సంఖ్య కోటీ 8లక్షలకు చేరిందని కేంద్ర నివేదిక లెక్కలు కట్టింది. ఈ నేపథ్యంలో, వాహనదారులు తమ ప్రయాణాల్లో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోకుండా వేగంగా, నిర్లక్ష్యంగా నడిపితే ఫలితాలు దారుణంగా ఉంటాయి. మన రాష్ట్రంలో ప్రతి 10 వాహనాల్లో 8 వాహనాలు ఏదో ఒక నిబంధనని ఉల్లంఘిస్తూనే ఉన్నాయంటూ కేంద్రం స్పష్టం చేసింది. ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా వాహనదారుల్లో అత్యధికశాతం మంది ద్విచక్రవాహనదారుల్లో ఇలాంటి అలక్ష్యాలే కనిపిస్తున్నాయి. హెల్మెట్ పెట్టుకోకుండా, ఒకచేత్తోనే వాహనం నడుపుతూ.. సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ వేగంగా వాహనాలు నడపడం చూస్తూనే ఉన్నాం. ఓ పదేళ్ళ కాలంలో మనదేశంలో జరిగిన రోడ్డుప్రమాదాలను విశ్లేషిస్తే, కనీసం 15 లక్షల మంది మరణించారని, మరో 40 లక్షల మంది వరకు గాయాలపాలైనారని గణాంకాలు చెప్తున్నాయి. దీంతో లక్షలాది కుటుంబాలు దిక్కులేని దీనస్థితికి చేరుకున్నాయంటే అతిశయోక్తి కాదు. ఏటా మనదేశంలో 5లక్షల రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిలో సుమారు లక్షా 50వేల మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇకనైనా వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను అరికట్టవచ్చనే నిజాన్ని ప్రతి వాహనదారుడు గ్రహించాలి. జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు జరిగే జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల పట్ల కూడా అవగాహన కల్పించుకోవాలి.  తమ పిల్లలకు, యువతకి, ఇరుగుపొరుగు వారికి కూడా రోడ్డు ప్రమాదాల పట్ల ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. వీధి వీధినా ఇలాంటి అవగాహన సదస్సులు జరగాలి. అపార్ట్‌మెంట్లలో కూడా వారానికోసారి రోడ్డు భద్రతపై  సమిష్టిగా చర్చించుకోవాలి. అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లోనూ రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలి. మనం నడిపే వాహనం సరిగా ఉందో చూసుకుంటూ, జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ఏమాత్రం ఏమరుపాటు జరిగినా..ఆ తర్వాత విచారించి ప్రయోజనం లేదని తెలియజెప్పాలి. 'విలువైనది కాలము.. బహు విలువైనది ప్రాణము.. నడుపుము మెలకువతో నీ వాహనము'.. అనే హెచ్చరిక బోర్డులను చూసైనా వాహనాలను జాగ్రత్తగా నడపాలి. సురక్షిత ప్రయాణాలే..మన జీవిత పయనాలని కూడా గుర్తుంచుకోవాలి.

# అభినందనీయులు రవాణా అధికారులు!




కొన్ని ముఖ్యమైన పండుగల సందర్భంగా ప్రయివేటు బస్సు యాజమాన్యాలు చేస్తున్న దోపిడీని ఈసారి రెండు తెలుగు రాష్ట్రాల రవాణాశాఖ అధికారులు సమర్ధవంతంగా అడ్డుకున్నారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాదు నగరం దాదాపుగా ఖాళీ అయిపోతుంది. ఆంధ్ర ప్రాంత ప్రజలతో అక్కడి స్థానిక జనం కూడా మన పెద్దపండుగ సంబరాలలో పాల్గొని సందడి చేస్తారు. అందుకోసం వేలసంఖ్యలో ఆంధ్రా పరిసర ప్రాంతాలకి తరలిరావడం గత కొన్ని దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. ఇలాంటి తరుణంలో ప్రయాణికుల అవసరాన్ని అవకాశంగా తీసుకుని ప్రయివేటు బస్సు యాజమాన్యాలు తమ ఇష్టానుసారం టిక్కెట్టు ధరని పెంచేస్తుంటాయి. ప్రయాణికులని నిలువు దోపిడీ చేస్తుంటాయి. అయితే, ఇటు ఆంధ్రా ప్రభుత్వం అటు తెలంగాణ సర్కారు తీసుకున్న చర్యల వల్ల ఈసారి ప్రయివేటు యాజమాన్యాల ఆగడాలు సాగలేదు. అధిక ధరలు వసూలు చేసిన వారిపై రెండు రాష్ట్రాల రవాణా అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. ప్రయాణికుల అవసరాల కోసం రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆర్టీసీ బస్సుల సంఖ్యని సైతం పెంచారు. రెండు వైపులకీ అధికసంఖ్యలో ప్రత్యేక బస్సులని ఏర్పాటు చేశారు. ప్రజల అవసరాలని గుర్తించి స్పందించిన రెండు రాష్ట్రాల ప్రభుత్వాల పెద్దలు, రవాణాశాఖ అధికారులు అభినందనీయులు.

పీ.కమల్‌బాబు, హైదరాబాదు.

# ఏ.ఆర్.రెహమాన్ లాంటివాళ్ళని సంఘ బహిష్కరణ చేయాలి!

ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ అనవసరంగా నోరుజారి తనకున్న మత పిచ్చిని బయటపెట్టుకున్నాడు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాలీవుడ్ సినిమా 'చావా' గురించి తలతిక్కమాటలు మాట్లాడాడు. ఒక మతాన్ని కించపరిచేలా ఆ సినిమాలో కొన్ని సన్నివేశాలు వున్నాయంటూ విమర్శలు చేశాడు. ఆ చిత్ర దర్శకుడిని తప్పుబట్టాడు. ఒక సినిమాకి సంగీతం చేయడానికి కోట్ల రూపాయలు తీసుకునే ఈ మత ఛాంధసుడికి 'శంభాజీ శివాజీ బాబా' చరిత్ర గురించి తెలియదా...? హిందూ మతం వదిలిపెట్టి వేరే మతంలోకి మారిన ఈ కుల గజ్జి దర్శకుడికి తాను ఎలాంటి సినిమాకు పనిచేయబోతున్నాననే స్పృహ కూడా ఉండదా...? సినిమా విడుదలై సంచలన రీతిలో విజయం సాధించాక ఈ కన్వర్టడ్ హిందూకి మరో మతం గుర్తొచ్చిందా..? ఇలాంటి పర్వర్టడ్ మనస్తత్వం వున్న వ్యక్తులని సినిమా పరిశ్రమ బహిష్కరించాలి. తన వృత్తిలో కూడా కులాన్ని అడ్డం పెట్టుకుని మత విద్వేషాలు రేపుతున్న రెహమాన్ లాంటి వాళ్ళని క్షమించకూడదు. తల్లి పాలు తాగి రొమ్ము గుద్దినట్లుగా ఓ మతంలో పుట్టి మరో మతంలోకి మారి, తన మాతృ మతానికి వ్యతిరేకంగా వాగుతున్న ఇలాంటి వాడిని సంఘ బహిష్కరణ చేసినా తప్పులేదు..!

లక్ష్మీభరద్వాజ్, హైదరాబాదు.




# గ్రంథాలయాలకి చెద...తీరు మారని వ్యథ!

గ్రంథాలయాలంటే అక్షర జ్ఞానాన్ని అందించే దేవాలయాలనీ, సరస్వతీ నిలయాలని పేరు.  ఏటా లక్షలాదిమంది విద్యార్థులకు, యువతకు, చదువరులకు ఎంతో జ్ఞానాన్ని అందించే విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు. ఒకప్పుడు మన రాష్ట్రంలో ఎన్నో అపురూపమైన గ్రంథాలతో గ్రంథాలయాలు కళకళలాడేవి.  కానీ, గత కొన్ని సంవత్సరాలుగా అవి వెలవెలబోతున్నాయి. ప్రభుత్వాలు, పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దాలుగా, వారి నిరాదరణకి సాక్షీభూతాలుగా నేటి గ్రంథాలయాలు దర్శనమిస్తున్నాయి. మన గ్రంథాలయాల దుస్థితి గురించి ఎంత చెప్పినా తరగదు. పాలకులెందరు మారినా, ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా మన గ్రంథాలయాల స్థితిగతులు మాత్రం మారడం లేదు. ఎక్కడ చూసినా శిథిలమైపోయిన భవనాలు, విరిగిన కుర్చీలు, బల్లలు, చినిగిన పుస్తకాలే మనకి కనిపిస్తాయి.

అత్యద్భుతమైన శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రాత్మక ప్రాభవ వైభవాలు చాటి చెప్పే కోట్లాది గ్రంథాలు మన గ్రంథాలయాలలో కుప్పలు తెప్పలుగా వున్నాయి. వాటి ఆలనాపాలనా చూసే పరిస్థితి లేక, అనేక  గ్రంథాలయాల్లోని పుస్తకాలు చెదలు పట్టిపోతున్నాయి. పాతబడిన భవనాల్లో ఉన్న లైబ్రరీలు శిథిలావస్తకు చేరి కూలిపోయే స్థితిలో ఉన్నాయి. వాటిని పట్టించుకునే నాధులే కరువయ్యారు. కొత్త భవనాలకు నిధులే మంజూరు కావడం లేదు. పుస్తకప్రియులకి అవసరమైన కనీస వసతులు కూడా గ్రంథాలయాలలో ప్రభుత్వాలు కల్పించడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే గ్రంథాలయ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారిపోయింది. ఏళ్ళు గడుస్తున్నా ఈ కథ తీరు మారని వ్యథగానే మిగిలిపోయింది. గత ప్రభుత్వాలు కూడా తాము అధికారంలోకి రాగానే రాజకీయ నిరుద్యోగులకి గ్రంథాలయ ఛైర్మెన్ పెదవులని కట్టబెట్టాయి. సదరు ఛైర్మెన్‌ల కనీస అర్హతలని కూడా పట్టించుకోలేదు. కొన్ని జిల్లాలలో అయితే నిరక్షరాస్యులకి సైతం గ్రంథాలయాల బాధ్యత కట్టబెట్టారు. అయితే, కూటమి ప్రభుత్వం సైతం అధికారంలోకి వచ్చాక, ఇటీవలే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ గ్రంథాలయాలకు పాలకులను నియమించింది. తమ పార్టీలోని చోటా నాయకులకి కూడా గ్రంథాలయ ఛైర్మెన్ బాధ్యతలు అప్పజెప్పింది. అంతే తప్ప గ్రంథాలయాల పునరుద్ధరణకి అవసరమైన నిధులు మాత్రం ఏ ప్రభుత్వమూ మంజూరు చేయలేదు. రాజకీయంగా తమకి పదవులిచ్చారని పార్టీ నాయకులు చెప్పుకోవడానికే తప్ప, గ్రంథాలయాల ఛైర్మెన్లకి ఈ పదవులు అలంకారప్రాయమే. పదవులున్నా నిధులు లేక విధులు లేక ఛైర్మెన్ పదవులు దిష్టిబొమ్మలుగానే మిగిలిపోతున్నాయంటే అతిశయోక్తి కాదేమో. కొయ్యగుర్రం మీద కూర్చుని ఎంత స్వారీ చేసినా, ఫలితం శూన్యమే కదా..! గ్రంథాలయ వ్యవస్థకి ఈ దుర్గతి ఎప్పుడు పోతుందా అని పుస్తకప్రియులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

## గ్రంథాలయాలు బోలెడు... నిధులు మాత్రం చారెడు!

తెలుగు అక్షరాలకి అత్యంత ప్రాశస్త్యం కలిగిన మన ఆంధ్రరాష్ట్రంలో గ్రంథాలయాలకి మాత్రం కొదవలేదు. పూర్వకాలంలో గ్రంథాలయోద్యమం పుణ్యమా అంటూ రాష్ట్రవ్యాప్తంగా లెక్కలేనన్ని గ్రంథాలయాలు వెలిశాయి. పుస్తకాలు చదువుకోవాలనుకున్నవారికి కొదవ లేకుండా పుస్తకాలుండేవి. ఇప్పటికీ మన రాష్ట్రప్రభుత్వ ఆధీనంలో 978 గ్రంథాలయాలు నడుస్తున్నాయి. వాటిలో 6 ప్రాంతీయ లైబ్రరీలు కాగా, 26 జిల్లా కేంద్ర గ్రంథాలయాలు. వీటికి శాఖలుగా మరో 800 గ్రంథాలయాలుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకో వంద వరకు వున్నాయి. ఇంకా ఎయిడెడ్ గ్రంథాలయాలనీ, ప్రైవేటు లైబ్రరీలనీ, దాదాపు 50 వరకు ఉండొచ్చు. ఇలా గ్రంథాలయాలు బోలెడున్నా నిధులు మాత్రం చారెడే అన్నట్లుగా వాటి దీనస్థితి దాపురించింది. గ్రంథాలయాల అభివృద్ధికి  స్థానిక సంస్థల నుంచి వచ్చే 'సెస్సు'లే మూలాధారం. ఆ నిధులు లేనిదే, అవి రానిదే ఏ పనీ జరగదు. గ్రంథాలయాలకి స్థానిక సంస్థల నుంచి రావాల్సిన సెస్సు బకాయిలు అన్నిటినీ కలుపుకుంటే, అవి వందల కోట్లల్లోనే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. ఆ నిధులు రాబట్టుకోలేక గ్రంథాలయాల నిర్వాహకులు ఏళ్ల తరబడిగా కసరత్తులు చేస్తూనే ఉన్నారు. కానీ, ఫలితం నామమాత్రమే. ప్రభుత్వం కనికరించి ఇకనైనా, ఆ సెస్సు బకాయిల సొమ్మును ఒక ప్రత్యేక జీఓ ద్వారా నేరుగా ప్రభుత్వం ద్వారానే  గ్రంథాలయాలకి అందజేస్తే తప్ప, గ్రంథాలయాలకి మోక్షం ఉండదు. ఆ విషయానికి సంబంధించి పిల్లి మెడలో గంట కట్టేవాళ్ళే కనపడడంలేదు.

## సిబ్బంది లేక కూడా ఇబ్బందులే...!

గ్రంథాలయాల్లో గ్రంథ సంరక్షణ చాలా ప్రధానం. పుస్తకాలు పాడుకాకుండా కాపాడుకోవాలి. చిరిగిన పుస్తకాలను బైండింగ్  చేయించాలి. పాఠకులు, పరిశోధకులకు అవసరమైన అంశాలను జెరాక్స్ లేదా కంప్యూటర్ ద్వారా ప్రింట్లు తీసివ్వడం వంటివి చేయాలి. అలాంటి ఆధునిక పరికరాలు కానీ, వాటిని వినియోగించగలిగే సాంకేతిక సిబ్బంది కానీ, గ్రంథాలయాల్లో లేరు. సాధారణ పాలనా సిబ్బందికే కరువుగా వున్న పరిస్థితులలో ఇక సాంకేతిక నైపుణ్యం గల ప్రత్యేక సిబ్బందికి అవకాశమే లేదు.

## అందుబాటులో ఆధునికత...!

చేతికి సెల్‌ఫోన్లు వచ్చి గూగుల్ అందుబాటులోవున్న కాలంలో గ్రంథాలయాలకి వచ్చే విద్యార్థులు, పాఠకుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. గూగుల్లో సైతం లభించని నీతిపుస్తకాలు, పరిశోధనాత్మక పురాతన గ్రంధాలు అందుబాటులో ఉంటే, లైబ్రరీలకి వచ్చే పాఠకుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఇకనైనా ప్రభుత్వం గ్రంథాలయాల దయనీయస్థితిని సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి తిరిగి పూర్వవైభవం తేవడానికి తగు చర్యలు తీసుకోకుంటే, నేటి తరానికే కాకుండా భావితరాలకి సైతం మన చరిత్ర గొప్పతనాన్ని, పాతతరాల మేధోసంపత్తిని మనం దూరం చేసిన వాళ్లమవుతాం. చారిత్రాత్మక గ్రంథాలు కాలగర్భంలో కలిసిపోతే మనం చరిత్ర హీనులుగా మిగిలిపోతాం. ఇప్పటికైనా కళ్ళు తెరుచుకుందాం, అపార జ్ఞాన సంపదని కాపాడుకుందాం.

***"జ్ఞానో రక్షతి రక్షితః", జ్ఞానాన్ని కాపాడుకుంటే అది మనల్ని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతుంది...!***

- రాజశ్రీ

# డ్రోన్ టెక్నాలజీ హబ్‌గా.. ఏపీ!

## దేశంలోనే తొలి 'మానవ రవాణా డ్రోన్ అంబులెన్స్'కి ప్రభుత్వం ప్రయత్నాలు



సీఎం చంద్రబాబునాయుడుతో సెంథిల్‌కుమార్, సతీష్‌రెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రోన్ టెక్నాలజీకి హబ్‌గా మార్చాలన్న సంకల్పంతో అమరావతిలో ఇటీవల శాస్త్రవేత్తల బృందంతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి ఆలోచన, ప్రముఖ శాస్త్రవేత్త..డీఆర్‌డీఓ మాజీ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌రెడ్డి మేధస్సు, డాక్టర్ సెంథిల్‌కుమార్ సాంకేతిక నిపుణత అంతా కలసి వెరసి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్లోబల్ హెల్త్ రూట్‌మ్యాప్‌లో ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కృషి ప్రారంభించింది. ట్రాఫిక్ స్తంభనల వంటి అడ్డంకులను అధిగమించి, గ్రామీణ ప్రాంతాల నుంచి సైతం రోగులను వేగంగా ఆసుపత్రులకు తరలించి, అత్యవసర సమయంలో వారి ప్రాణాలు కాపాడేందుకు అందుబాటులోకి రానున్న డ్రోన్ అంబులెన్స్ సేవల విషయమై వారు చర్చించారు. దీంతో, దేశంలోనే ఇది మొట్టమొదటి మానవ రవాణా డ్రోన్ అంబులెన్స్‌గా పేరు తెచ్చుకోనుంది. ఈ సందర్భంగా డ్రోన్ అంబులెన్స్ సాంకేతికత వివరాలను సతీష్‌రెడ్డి తదితరులు సీఎం చంద్రబాబుకి వివరించారు. 1,200 అడుగుల ఎత్తులో గగనతలంలో ప్రయాణించే ఈ డ్రోన్ అంబులెన్స్..150 కిలోల బరువును మోస్తూ గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదని వారు తెలిపారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ డ్రోన్ అంబులెన్స్ మానవ రహిత ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ ద్వారా పర్యవేక్షించబడుతుందని శాస్త్రవేత్తల బృందం తెలిపింది. ఈ ప్రణాళికలో భాగంగా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగుల కోసం ప్రత్యేక అత్యవసర గగనతల కారిడార్ల వ్యవస్థను కూడా రూపొందించనున్నారు. చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కలాం అడ్వాన్స్‌డ్ యూఏవీ రీసెర్చ్ సెంటర్ (సీఏఎస్ఆర్) ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సారథిగా వ్యవహరిస్తోంది. సీఏఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ కె.సెంథిల్‌కుమార్ నాయకత్వంలో ఈ డ్రోన్ అంబులెన్స్ తయారవుతోంది. బియాండ్ విజువల్ లైన్ ఆఫ్ సైట్ (బీవీఎల్ఓఎస్) ఫ్రేమ్‌వర్క్ మరియు రోబోటిక్ అసిస్టెన్స్ వ్యవస్థలను అనుసంధానిస్తూ ప్రయాణించేలా డ్రోన్ అంబులెన్స్ రూపొందిస్తున్నారు. ఈ ఏడాది మే నెల మొదటి వారంలో డ్రోన్ అంబులెన్స్ మొదటి ప్రోటోటైప్ ప్రదర్శన జరగనుంది. దీనికి అనుబంధంగా విజయవాడలో ఒక భారీ డ్రోన్ పోర్ట్ మరియు హబ్‌ను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేస్తుండడం విశేషం.

# జాకీర్ మృతి బాధాకరం

## • సీఎం చంద్రబాబు నివాళి

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు జాకీర్ భౌతికకాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. జాకీర్ మరణం తీరని లోటని బాధను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణలు జాకిర్ కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. టీడీపీ ఒక నిబద్ధత గల కార్యకర్తను కోల్పోయిందని. చిన్న వయసులోనే జాకీర్ మరణించడం పార్టీకి తీరని లోటనివారు విచారం వ్యక్తం చేశారు.

### మంత్రి ఆనం దిగ్భ్రాంతి :

తెలుగుదేశం పార్టీ మైనార్టీ యువనేత మహమ్మద్ జాఫర్ షరీఫ్(జాకీర్) ఇటీవల ఒంగోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం పట్ల రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆనం కుటుంబానికి ఆయన అత్యంత ఆత్మీయులని, పార్టీలో క్రమశిక్షణ కలిగిన సైనికుడిగా..అందరి మన్ననలు పొందారని అన్నారు. ఆయన మృతికి సంతాపం తెలియచేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

### పాడె మోసిన..మంత్రి నారాయణ :



జాకీర్ నివాసానికి చేరుకున్న మంత్రి పొంగూరు నారాయణ, జాకీర్ పార్థివదేహాన్ని చూసి భావోద్వేగానికి లోనయ్యారు. గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం జాకీర్ అహర్నిశలు శ్రమించారని గుర్తుచేసుకున్నారు. జాకీర్ మృతి తనకు తీరని లోటని అంటూ ఆవేదనకు గురయ్యారు. అనంతరం, జాకీర్ పార్థివ దేహానికి ముస్లిం సంప్రదాయం ప్రకారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అశ్రు నయనాల మధ్య అంతిమ యాత్రలో పాల్గొన్న మంత్రి నారాయణ, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్‌తో పాటు జాకీర్ పాడెను మోశారు. ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నేతలు జెడ్ శివప్రసాద్, వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆణిముత్యాలు..మన వేమన పద్యాలు!

## • జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సిబ్బంది

ప్రజాకవి వేమన పద్యాలు ఆణిముత్యాలని, సమాజంలోని అంధవిశ్వాసాలని, మూఢాచారాలని ఖండిస్తూ వేమన రాసిన పద్యాలు ప్రజలకి చైతన్యకిరణాలని జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కొనియాడారు. వేమన జయంతి సందర్భంగా ఇటీవల నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో, వేమన యోగి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 17వ శతాబ్దానికి చెందిన వేమన తత్వవేత్త, సామాజిక సంస్కర్త అని ఆమె అన్నారు. ఆయన చెప్పిన పద్యాలు సులభమైన భాషలో, లోతైన అర్థంతో నేటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయన్నారు. వేమన పద్యాలంటే ప్రజలకి ఎంతో అభిమానమని, వేమన బోధనలు ఆచరణీయాలని చెప్పారు.



# వేడుకగా తెప్పోత్సవం

నెల్లూరు నగరంలోని మైపాడు గేట్ సెంటర్ ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. సంక్రాంతి పర్వదినాలని పురస్కరించుకుని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామివారి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి తెప్పోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు తరలిరావడంతో మైపాడు గేట్ పరిసరాలు జనసంద్రంగా మారాయి.

# కావలిలో పోస్టర్ల ఆవిష్కరణ

ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం నీరుగారుస్తోందని నిరసన తెలియజేస్తూ కావలి పట్టణంలో ఈనెల 20న సీపీఎం నాయకుడు ఎం.మోహన్‌రావు ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధిహామీ పథకానికి కోత విధించడం దారుణమని, వారు పేర్కొన్నారు. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన విబీ జీ రాంజీ బిల్లును రద్దుచేసి, పాత ఉపాధి హామీ పథకాన్ని అమలుచేయాలని ఆయన కోరారు. కార్మికులకు నష్టం కలిగించే కార్మిక చట్టాలను రద్దుచేయాలని, సీపీఎం దేశవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, వెంకయ్య, మధుసూదన్‌రావు, క్రిష్ణయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారులకు అత్యున్నత సేవలందించండి

## • తిరుపతిలో ఏపీ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ అతిథి గృహాన్ని ప్రారంభించిన సీ.ఎస్.

### రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పిలుపు



ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ తిరుపతి పట్టణంలో కొత్తగా నిర్మించుకున్న అతిథి గృహం "శ్రీ శ్రీనివాస సదన్" జనవరి 21వ తేదీ బుధవారం ప్రారంభోత్సవం జరుపుకుంది. విద్యుత్ శాఖ పూర్వ ఉద్యోగి, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్, ఐఏఎస్ చేతులమీదుగా ఈ ప్రారంభోత్సవం జరిగింది. అత్యంత అధునాతన వసతులతో, శోభాయమానంగా నిర్మించబడిన ఈ భవనం నిర్మాణం పూర్తి చేసుకుని ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యుల సేవ కోసం బుధవారం నుండి అందుబాటులోకి వచ్చింది.



విజయానంద్

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అందరూ కష్టపడి పనిచేసి విద్యుత్ వినియోగదారులకు అత్యున్నత సేవలందించాలని, విద్యుత్ సంస్థలను లాభాల బాటలో నడిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యుత్ సంస్థలో డిప్లొమా ఇంజనీర్లు ఎంతో ఐకమత్యంగా, క్రమశిక్షణతో, కష్టపడి పనిచేస్తారని కితాబు ఇచ్చారు. తిరుపతి శ్రీవారి సన్నిధిలో ఇంత మంచి గెస్ట్‌హౌస్ కట్టడం చాలా సంతోషకరమని, రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ఉద్యోగులందరికీ ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అలాగే అసోసియేషన్‌ను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని గోల్డెన్ జూబ్లీలోకి అడుగుపెట్టిన సందర్భంగా అసోసియేషన్ సభ్యులకి శుభాకాంక్షలు తెలిపారు. డిప్లొమా ఇంజనీర్లకు సంబంధించిన సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ శుభ వేడుకలో ముఖ్యఅతిథులుగా ఏపీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్, ఐఏఎస్, పూర్వపు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీలు కే.రంగనాథం, పీ.గోపాల్‌రెడ్డి, విద్యుత్ సంస్థల డైరెక్టర్లు చీఫ్ జనరల్ మేనేజర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పాల్గొన్నారు. వీరితోపాటు డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు ఏ.సుబ్బారావు, రాష్ట్ర అధ్యక్షులు కే.వీ.శేషారెడ్డి, ట్రస్ట్ ఛైర్మన్ వి.వి.




అతిథి గృహాన్ని ప్రారంభిస్తున్న సీ.ఎస్ విజయానంద్

మహేశ్వరరెడ్డి, రాష్ట్ర సెక్రెటరీ జనరల్ పి.సన్యాసిరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు పీ.హుస్సేన్‌ఖాన్, ఏపీఎస్పీ ఈ జేఏసీ కన్వీనర్ ఎం.వీ.రాఘవరెడ్డి, అసోసియేషన్ నాయకులు, డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్ నాయకులే కాకుండా రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు కూడా పాల్గొన్నారు.

# నెల్లూరు నగర డీఎస్పీగా..దీక్ష


ఎస్పీ అజితతో డీఎస్పీ దీక్ష

నెల్లూరు నగర డీఎస్పీగా ఐపీఎస్ అధికారిణి దీక్ష ఇటీవల బాధ్యతలు చేపట్టారు. హర్యానా రాష్ట్రానికి చెందిన ఆమె 2016లో యుపీఎస్‌సి పరీక్షలు రాసి, ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారిణిగా పీఎంఓలో విధులు నిర్వహించారు. 2018లో సివిల్ సర్వీసెస్ పరీక్షలు రాసి, ఢిల్లీలో ఏపీసీగా పనిచేశారు. 2021లో ఐపీఎస్ పరీక్షల్లో 208వ ర్యాంకు సాధించి, గుంటూరులో శిక్షణ పొందారు. అనంతరం గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్–1గా పనిచేశారు. క్రమశిక్షణతో, నిబద్ధతతో పనిచేసే అధికారిణిగా మంచిపేరు తెచ్చుకున్న ఆమెను తాజాగా ప్రభుత్వం నెల్లూరు నగర డీఎస్పీగా నియమించింది. నగర డీఎస్పీగా ఐపీఎస్ స్థాయి అధికారిణి నియామకం కావడం కూడా జిల్లాలో ఇదే తొలిసారి అని భావిస్తున్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె జిల్లా ఎస్పీ అజిత వేజెండ్లను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలకు సంబంధించిన పలు అంశాలపై జిల్లా ఎస్పీతో చర్చించారు.

# డీకేడబ్ల్యూలో అవగాహన సదస్సు


జిల్లా కలెక్టర్‌కి జ్ఞాపికను అందజేస్తున్న

ఆరోగ్యవంతమైన సమాజం మహిళల ద్వారానే సాధ్యమని, కనుకనే విద్యార్థినులు చిన్న వయస్సు నుంచే వివిధ రకాల వ్యాధులపై అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. ఈ నెల 1 నుండి 31 వరకు జరుగుతున్న గర్భాశయ ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో భాగంగా, మంగళవారం నగరంలోని డికెడబ్ల్యు మహిళా కళాశాలలో కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో హెచ్‌పివి టీకా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని, సరైన అవగాహన, సమయానికి తీసుకునే టీకాలు, నిత్య ఆరోగ్య పరీక్షల ద్వారా ఈ వ్యాధులను పూర్తిగా నివారించవచ్చునని తెలిపారు. సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ టి.జి.లక్ష్మీదుర్గ, డాక్టర్ మోహనసాయి రూప, కిమ్స్ హాస్పిటల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి ప్రియలక్ష్మి, డీకేడబ్ల్యు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి, ఆర్.ఐ.ఓ టి.వరప్రసాద్, బి.వి. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూలస్థానేశ్వరుని సేవకి.. కొత్త పాలకవర్గం

నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూలస్థానేశ్వరాలయానికి ప్రభుత్వం తాజాగా ఈనెల 19న కొత్త పాలకమండలిని నియమించింది. ఆలయ పాలకమండలి సభ్యులుగా పి.వెంకట అజయ్‌కుమార్, పి.శైలజ, వై.సుధీర్‌బాబు, కె.లీల, ఎస్ ఉషారాణి, జె.హేమచంద్ర, డి.నరేంద్ర, వై.పోలమ్మ, రాజుకృష్ణ, ఎన్.శ్రీకృష్ణ, పి.విజయమ్మలతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యునిగా వి.శివకుమార్ నియమితులయ్యారు.

# నెల్లూరు కబుర్లు

## కార్పొరేషన్‌ను..ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

● ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్


మొక్కలు నాటుతున్న ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆలోచనలతో, నెల్లూరు కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్ ప్రకటించారు. నగరంలోని 39, 40 డివిజన్ల పరిధిలోని మూలాపేట ప్రాంతంలో మొక్కల పెంపకం, సి.సి రోడ్ల నిర్మాణం పనులకు ఆయన ఈనెల 21న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ నెల 12వతేదీ నాటికి నగర వ్యాప్తంగా పచ్చదనం, సిసి రోడ్ల నిర్మాణం, శానిటేషన్, విద్యుత్ లైట్లు తదితర మౌలిక వసతులను కల్పించి కూటమి ప్రభుత్వ రెండు సంవత్సరాల పాలనకు నిదర్శనంగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు చూపబోతున్నామని తెలిపారు. సుమారు 20లక్షల రూపాయలతో మొక్కల పెంపకం, నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్ క్యాప్) కేంద్ర నిధులు 60 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం పనులను చేపట్టనున్నామని చెప్పారు.

## పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి


పెద్దాసుపత్రి ప్రాంగణంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

పెద్దాసుపత్రిలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఈనెల 19న ఆయన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మదపర్తి శ్రీనివాసులు, డైరెక్టర్లతో కలసి ఆసుపత్రి ప్రాంగణంలో పారవేసివున్న చెత్తాచెదారాన్ని పరిశీలించారు. నిత్యం ఎంతోమంది రోగులు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారని, పారిశుద్ధ్య పరిస్థితుల్లో కచ్చితంగా మార్పు రావాలని, ప్రజల ఆరోగ్య విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

# బారాషహీద్ దర్గాలో..
# 15 కోట్లతో షాహీ మసీదు!

- - వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడి - -


అధికారులతో చర్చిస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరులోని చరిత్రాత్మకమైన బారాషహీద్ దర్గా ప్రాంగణంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా షాహీ మసీదు నిర్మాణానికి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ సారథ్యంలో కృషి ప్రారంభమైంది. ఈనెల 19న ఆయన నెల్లూరులోని తమ నివాసంలో కార్పొరేషన్–మునిసిపల్ అధికారులతో కలసి సమావేశం ఏర్పాటుచేసి, ఆ నిర్మాణానికి సంబంధించిన డిజైన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అజీజ్ మాట్లాడుతూ, షాహీ మసీదును అత్యంత సుందరంగా రూపుదిద్దబోతున్నామని, అందుకు 15 కోట్ల రూపాయలు ఖర్చవుతాయని, ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందుకు 5 కోట్ల రూపాయలను మంజూరు చేసి ఉన్నారని చెప్పారు. పురపాలక మంత్రి నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిల సహకారంతో మసీదు నిర్మాణం త్వరలోనే ప్రారంభమవుతుందని, ఇది నెల్లూరుకే కాకుండా రాష్ట్రానికే ఒక విశిష్ట ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండాలనే ధ్యేయంతో పనిచేస్తున్నామని తెలిపారు.

# వాకర్స్ వ్యవస్థాపకులు ఆళ్వార్‌దాస్‌కి..నివాళి


ఆళ్వార్‌దాస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు ఆళ్వార్‌దాస్ 23వ వర్ధంతి సందర్భంగా ఈనెల 20న నెల్లూరులోని ఏ.సి సుబ్బారెడ్డి స్టేడియంలో 203–డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1986లో వాకర్స్ అసోసియేషన్ స్థాపించి 'నడువు–నడిపించు' అంటూ, ప్రజలందరూ వాకింగ్ చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని వాకర్స్ సంఘాన్ని స్థాపించారని, తద్వారా ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మించాలన్నదే ఆ మహనీయుని ధ్యేయమని ఆయన కొనియాడారు. వాకర్స్ అందరూ వారి ఆశయాల బాటలో నడవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీ స్టేడియంలో ఉన్న అన్ని వాకర్స్ అసోసియేషన్లు పాల్గొన్నాయి. వివేకానంద వాకర్స్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్, ఫ్రెండ్స్ వాకర్స్, స్మైల్ వాకర్స్, ఏసి స్టేడియం మహిళా వాకర్స్ సభ్యులు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఏకొల్లు రాఘవరెడ్డి, దాసరి అనంత రామారావు, పొన్నం రవిచంద్ర, డి.వి.సుబ్బరాజు, కె.రఘురాం ముదిరాజ్, వేలూరు రంగారావు, ఎస్‌కే నసీర్ అహ్మద్, ఎస్‌కే అజ్మీర్ భాషా, ఎస్‌కే ఖమ్రుద్దీన్, కె. మల్లెం కొండారెడ్డి, మేకల నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొని ఆళ్వార్‌దాస్ సేవలను స్మరించుకున్నారు.

# 'పుష్పగిరి' నవల ఆవిష్కరణ


'పుష్పగిరి' నవలను ఆవిష్కరిస్తున్న ప్రముఖ కవులు, కవయిత్రులు

నెల్లూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి ఎస్‌వీఎం గాయత్రి రచించిన 'పుష్పగిరి' నవలను ఇటీవల స్థానిక దర్గామిట్టలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో ఆవిష్కరించారు. పలు ప్రాంతాల కవులు, రచయితలు ఈ ఆవిష్కరణోత్సవంలో పాల్గొని రచయిత్రిని అభినందించి సన్మానించారు. ప్రముఖ కవి అవ్వారు శ్రీధరబాబు ఆ నవలలోని శైలిని, విశేషాలను సమీక్షించారు. కవులు, కవయిత్రులు గోవిందరాజుల సుభద్రాదేవి, పెన్నా రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మోపూరు పెంచలనరసింహం, మాటేటి రత్నప్రసాద్, ఇంద్రగంటి మధుసూదన్ రావు, పార్లపల్లి నాగేశ్వరి, అన్నం శివకృష్ణ, హస్తి లక్ష్మణ్‌రాజు, కుని అంకబాబు, డి.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.




# బాల్య వివాహాలను నిరోధించాలి

నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈనెల 21న "బాల్య వివాహ ముక్త భారత్.. 100 రోజుల అవగాహన కార్యక్రమం"లో భాగంగా బాల్య వివాహాలపై స్థానిక చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ మరియు సమగ్ర బాలల సంరక్షణ పథకం సంయుక్తంగా కలసి జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిఎల్ఎస్ఏ సెక్రటరీ కే.వాణి, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి హేనా సుజన్ తదితరులు పాల్గొని బాల్య వివాహాలు ఎంత అనర్థదాయకమో వివరించారు. బాలలు బాగా చదువుకొని అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. బాల్యవివాహాలు చేయడం, ప్రోత్సహించడం నేరమని తెలిపారు. డీఇఓ బాలాజీరావు, చైతన్య జ్యోతి డైరెక్టర్ శ్రీనివాసరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి బి.సురేష్ పాల్గొన్నారు.

# ఆనం చొరవతో.. పాత ఆలయాలకి కొత్త కళ!



## రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలకి మహర్దశ!

కొంతమందికి పదవులు వన్నె తెస్తాయి. మరికొందరు ఆ పదవులకే వన్నె తెస్తారు. ఈ రెండో కోవకి చెందినవారు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి.. మన నెల్లూరీయులైన ఆనం రామానారాయణరెడ్డి.

సహజంగానే ఆయన దైవభక్తులు. చిన్నతనంలో సంతపేట ఆంజనేయస్వామి వారి ఆలయంలో ప్రదక్షిణలు చేయడం దగ్గర నుంచి, శ్రీ రంగనాథస్వామి దేవాలయంలో పూజలు చేయడం, వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధికి అండగా ఉండడం వరకు ఆయన ఆధ్యాత్మిక జీవిత ప్రస్థానం అద్వితీయంగా సాగుతూనే ఉంది. గతంలోనూ రాష్ట్రస్థాయిలో ఎన్నో పదవులు అలంకరించిన ఆనం, ఇప్పుడు దేవాదాయశాఖ మంత్రిగా తన దైవభక్తిని మరింతగా చాటుకుంటున్నారు. జిల్లాలోనే కాక, రాష్ట్రంలోని వేలాది దేవాలయాల అభివృద్ధికి ఆయన నిరంతరం చేస్తున్న కృషి అపారం!. అద్వితీయమనే చెప్పాలి!..



మూలాపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆనం

దేవాలయాలకి గత ప్రభుత్వ హయాంలో గ్రహణం పట్టిందనే సంగతి అందరికీ తెలిసిందే. అప్పట్లో వేల కోట్ల ఆలయ నిధులు పక్కదారి మళ్ళాయని, ప్రత్యేకించి టీటీడీ శ్రీవాణి నిధులు భారీ మొత్తంలో దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వచ్చాయి. పలు ఆలయాల్లో విధ్వంసాలు కూడా జరిగాయి. అర్చకులు సరైన జీతాలు లేక అవస్తలు పడేవారు. ఆలయాల్లో దీపం వెలిగించే నాథులు లేక అనేక దేవాలయాలు అంధకారబంధురంగా ఉండేవి. చివరికి భగవంతునికే దిక్కులేని దీనస్థితిని తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి, దేవాదాయశాఖ మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి వచ్చాక ఆలయాలకి మహర్దశ వచ్చినట్లయింది. హిందూ ధర్మ పరిరక్షణ కోసం, పురాతన-చారిత్రిక ఆలయాల సముద్ధరణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారధ్యంలో, మంత్రి ఆనం నడుం బిగించారు. ఆలయాల్లో పని చేస్తున్న అర్చకుల వేతనాలను పెంచి క్రమబద్ధీకరించారు. ఆలయాల్లో నిత్య ధూప దీప నైవేద్యాలకు కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకోవడంతో ఆలయాలకు కళ వచ్చింది. ఆ తర్వాత నుంచి రాష్ట్రంలోని అన్ని దేవాలయాల స్థితిగతులను అనేక సార్లు సమీక్షించి, ఏ దేవాలయాన్ని ఎలా అభివృద్ధి చేయాలో నిర్ణయించుకుని, ఆమేరకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆలయాలకి కొత్త పాలకమండళ్లను నియమిస్తూ, అటు దైవసేవలకు, ఇటు భక్తులకి, వారి మౌలిక సదుపాయాలకి ఆలయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. శిథిలమైపోతున్న పురాతన దేవస్థానాలకి కూడా పునరుజ్జీవం కలిగిస్తున్నారు. గతి తప్పిన ఆలయ పాలనా వ్యవస్థను గాడిన పెడుతున్నారు. ప్రత్యేకించి మంత్రి ఆనం చొరవతో వేలాది దేవాలయాలు కొత్త కళని సంతరించుకోవడంతో భక్తలోకంలో హర్షాతిరేకాలు వెల్లడవుతున్నాయి.

### రాష్ట్రంలో మరో 5 వేల ఆలయాలు :

టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులతో రాష్ట్రంలో మరో 5వేల ఆలయాలు నిర్మించేందుకు కూడా ప్రభుత్వం సంకల్పించడంతో, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా ఏజన్సీ ప్రాంతాలతో పాటు నగర, పట్టణ, గ్రామ శివారు ప్రాంతాలలో ఈ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాలను ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో ధూప దీప నైవేద్యం పథకం ద్వారా ఐదువేలకు పైగా ఆలయాలకు ప్రతినెలా 10వేల రూపాయలు అందిస్తున్నారు. నెల్లూరుజిల్లాలో 450 ఆలయాలకు ఈ పథకం ద్వారా ఆ డబ్బును అందజేస్తున్నారు కూడా. అంతే కాకుండా, 800కిపైగా ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ప్రతి ఆలయం కూడా ప్రతినిత్యం భక్తులతో కళకళలాడుతూ నిత్య పూజా కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

### జిల్లాలో 80 కోట్లతో ఆలయాల అభివృద్ధి...

ప్రత్యేకించి మంత్రి ఆనం స్వస్థలమైన నెల్లూరు జిల్లాలో ఆలయాల అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. జిల్లాలో 57 ఆలయాలను సుమారు 80 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారంటే అదంతా ఆనం చొరవతోనే అన్నది స్పష్టం. అంతేకాదు, జిల్లాలోని 112 ఆలయాల్లోని అర్చకుల వేతనాలకి ఇబ్బంది లేకుండా ప్రతినెల రూ.15 వేల చొప్పున 11 లక్షల రూపాయలకుపైగా అందజేస్తున్నారు. ఈనెల 20న మంత్రి ఆనం నెల్లూరులో జరుగుతున్న శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలోని పలు ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నామని చెప్పారు. నెల్లూరు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలతో పురాతన ఆలయాల పునర్నిర్మాణ పనులు చేపట్టి, నెల్లూరును ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.

### 17 కోట్లతో.. వేణుగోపాలస్వామి ఆలయం పనులు

రూ.17 కోట్ల వ్యయంతో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, అదేవిధంగా నవాబుపేటలోని పురాతన శివాలయం పునఃనిర్మాణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి ఆనం తెలిపారు. జిల్లాలోని సోమశిలలో గతంలో వరదలకు దెబ్బతిన్న శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. బిట్రగుంటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, నర్రవాడలోని శ్రీ వెంగమాంబ అమ్మవారి దేవాలయం, ఉదయగిరిలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.

అనంతరం ఆయన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవమైన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆత్మార్పణ రోజును రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంతో అమ్మవారి భక్తుల ఆనందానికి అవధుల్లేవని మంత్రి ఆనం ఈ సందర్భంగా తెలిపారు.

# బీవీఎస్ స్కూల్ ఆధునీకరణకు.. రూ. 5.5 కోట్లు

## మంత్రి నారాయణ

నెల్లూరు నగరంలోని మునిసిపల్ స్కూళ్ళను కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి చేస్తామని, స్టోన్‌హౌస్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ ఆధునీకరణకు 5.5 కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర పురపాలకమంత్రి డా. పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన ఆ స్కూల్ పూర్వ విద్యార్థులతో కలిసి ఆయన పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. సుమారు 50 ఏళ్ల క్రితం ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల కోరిక మేరకు మంత్రి నారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నెల్లూరు నగరంలోని మొత్తం 15 మున్సిపల్ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే దాతలు, వ్యాపారవేత్తల



బీవీఎస్ స్కూల్ పూర్వవిద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

సహకారంతో పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విఆర్ హైస్కూల్ అభివృద్ధి కోసం ఇప్పటికే 15 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని, అదే స్ఫూర్తితో బీవీఎస్ స్కూల్‌ని ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు.

# వైద్య వీరరాఘవస్వామికి.. నారాయణ పూజలు



వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకుంటున్న మంత్రి నారాయణ

తై అమావాస్య సందర్భంగా ఈనెల 18న నెల్లూరు రామ్‌నగర్‌లోని శ్రీ వైద్య వీరరాఘవస్వామి ఆలయంలో మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్‌నగర్‌లోని వేమాలశెట్టి బావి, వైద్య వీరరాఘవస్వామి ఆలయానికి 400 వందల సంవత్సరాల చరిత్ర ఉంది. ఇక్కడ స్వామివారికి మొక్కుకుంటే కోరిన కోరికలు తీరడంతో పాటు, అనారోగ్య బాధలు కూడా సమసిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయ సంప్రదాయం ప్రకారం మంత్రి నారాయణ ఆలయ ప్రాంగణంలోని శివలింగంపై ఉప్పు,మిరియాలు వేసి పూజలు చేశారు. పక్కనే ఉన్న వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఆలయాన్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బాగా అభివృద్ధి చేశారన్నారు. భవిష్యత్తులో ఈ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, మాజీ మేయర్ భానుశ్రీ, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, రూరల్ టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.




పల్లిపాడు 'డైట్' కళాశాలలో...

# వేడుకగా.. 'రంగోత్సవ్'



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డైట్ కళాశాల అధ్యాపకులు

ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని ప్రభుత్వ డైట్ కళాశాలలో ఈనెల 20న జిల్లాస్థాయి 'రంగోత్సవ్' కార్యక్రమం వేడుకగా జరిగింది. డైట్ ప్రధానాచార్యులు వి. అక్కిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 30 పాఠశాలల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో తమ ప్రతిభను చాటు కున్నారు. విద్యార్థులలో దాగివున్న కళా నైపుణ్యాలను వెలికితీయ డమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలు, సమగ్రశిక్ష, జిల్లా విద్యాశాఖ, ప్రభుత్వ డైట్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రంగోత్సవ్ కార్యక్రమం జరుగుతుండడం తెలిసిందే. జిల్లా స్థాయిలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల నుండి, 6 నుండి 8 తరగతులు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. 30 పాఠశాలల నుండి 160 మంది విద్యార్థులు 5 విభాగాలలో పోటీపడ్డారు. ప్రథమస్థానంలో నిలిచినవారు ఈనెల 23న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి రంగోత్సవ్‌లో పాల్గొంటారు.

## ప్రథమ విజేతలు వీరే :

చిత్రలేఖనం(డ్రాయింగ్)లో జి.యశ్విత (8వ తరగతి, జి.వి.కె.చిన్మయ విద్యాలయ, కొత్తూరు, ఇందుకూరుపేట) ప్రథమస్థానం సాధించగా, చేతిరాతలో జి.సాయి రమ్యశ్రీ (7వ తరగతి, ఆంధ్రకేసరి పురపాలకోన్నత పాఠశాల-కావలి), రంగవల్లుల పోటీలో టి.సిరిచందన, ఎంజె పుష్పలత, కె.శ్రావణి, ఎస్‌కె పర్వీన్ (జడ్పీ హైస్కూలు-కనపర్తిపాడు, నెల్లూరు రూరల్) ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. అదేవిధంగా, జానపద నృత్యాల పోటీలో యస్.కె.తాన్యా, పి.నాగవల్లి, ఎమ్.శ్రావణి, యస్.కే.సఫా, బి.రిత్విక (ఎ.కె.యమ్.పి.యు.పి.స్కూల్-కావలి) ప్రథమస్థానంలో నిలవగా, పాత్రపోషణ అంశంలో జరిగిన పోటీలో వి.మహీధర్, బి.చరణ్‌సాయి, బి.కేశవర్ధన్(జడ్పీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల, వెలిగొండ, టి.పి.గూడూరు మండలం)లు ప్రథమస్థానం సాధించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కొమరిక స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.దశరథరామి రెడ్డి, అచ్యుతమణి(రాపూరు), మల్లాది అనూష (సంగీత ఉపాధ్యా యిని, కోవూరు), పి.నాగరాజారావు (యస్.జి.టి-అల్లూరు), ముదివర్తి శ్రీహరి (డ్రాయింగ్ టీచర్-కొత్తూరు) వ్యవహరించారు. డైట్ సీనియర్ అధ్యాపకులు డి.హైమావతి (నోడల్ ఆఫీసర్), వి.రాధారాణి, యల్.నటరాజమూర్తి, జి.సుబ్బారావు, యస్.కే. యన్.ఖాజారసూల్, కె.విజయచంద్ర, ఉపన్యాసకులు యు.యస్. రఘుకుమార్, యస్.మాధవీలత, జి.నీరజ, డాక్టర్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ కేడెట్లకు పరీక్షలు

10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గౌదంగవే ఆధ్వర్యంలో ఈనెల 18న నెల్లూరులోని దర్గామిట్ట జడ్పీ స్కూల్‌లో ఎన్‌సీసీ కేడెట్లకు 'ఏ-సర్టిఫికెట్' పరీక్షలు జరిగాయి. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలలో రెండేళ్లు శిక్షణ పొందిన క్యాడెట్లకు ఈ పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ శిక్షణకు సంబంధించిన పలు అంశాలపై జిల్లా వ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఈ పరీక్షలను పటిష్టంగా నిర్వహించడం జరిగింది. బాలల్లో క్రమశిక్షణ, సేవా భావం, జాతీయ సమైక్యత, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఎన్‌సీసీ కృషి చేస్తోందని ఈ సందర్భంగా లెఫ్టినెంట్ కమాండర్ తెలిపారు. పరీక్షల నిర్వహణను ఆయా పాఠశాలలకు సంబంధించిన అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, సి. వి. నాగరాజు, డి. పెంచలయ్య, అరోరా, ప్రసాద్, లక్ష్మీనారాయణ, కేర్ టేకర్ ఆఫీసర్లు శారద, ప్రియాంక, ఎన్‌సీసీ పిఐ స్టాఫ్ లోకేష్,లక్ష్మణ్ కుమార్, బాదల్ పాండ, లక్ష్మీనారాయణ, షిప్ మోడలింగ్ ఇన్‌స్ట్రక్టర్ ఎస్‌వీ రామన్, సీనియర్ అసిస్టెంట్లు కల్పన, షహనాజ్ బేగం, జూనియర్ అసిస్టెంట్ సుజాత, లస్కర్లు కుమార్ రాజా, సందీప్ తదితరులు పర్యవేక్షించారు.

# గ్రీన్‌లాండ్ రగడ: ట్రంప్ 'నయా సామ్రాజ్యవాదం'




రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచం ఒక క్రమబద్ధమైన అంతర్జాతీయ నియమావళికి అలవాటుపడింది. కానీ, నేడు ఆ నిబంధనలన్నీ కాలగర్భంలో కలిసిపోయేలా కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేసి తీరతామని మంకుపట్టు పట్టడం, ఐరోపా సమాఖ్య - అమెరికా మధ్య దశాబ్దాల కాలంగా ఉన్న స్నేహబంధాన్ని నిప్పుల కొలిమిలోకి నెట్టింది. ఇది కేవలం ఒక ద్వీపం విషయం కాదు; ఇది నాటో భవిష్యత్తును, అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలను, పాశ్చాత్య ప్రపంచంలోని ఐక్యతను ప్రశ్నార్థకం చేస్తోంది.

## ఆర్థిక ఉగ్రవాదం: సుంకాల హెచ్చరికలు

గ్రీన్‌లాండ్ విషయంలో డెన్మార్క్, ఐరోపా సమాఖ్య లొంగకపోవడంతో ట్రంప్ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టారు. జనవరి 17న ఆయన చేసిన ప్రకటన ప్రపంచ విపణిని వణికించింది. డెన్మార్క్, నార్వే, జర్మనీ, ఫ్రాన్స్ వంటి ఎనిమిది మిత్రదేశాలపై ఫిబ్రవరి 1 నుంచి 10% పన్నులు విధిస్తామని, జూన్ నాటికి దాన్ని 25%కి పెంచుతామని ఆయన హెచ్చరించారు. గ్రీన్‌లాండ్ ఒప్పందం జరిగే వరకు ఈ పన్నుల బాదుడు కొనసాగుతుందనడం 'అంతర్జాతీయ బ్లాక్‌మెయిలింగ్' తప్ప మరొకటి కాదు. దీనికి ప్రతిగా ఐరోపా సమాఖ్య తన "ట్రేడ్ బజూకా" (ఆర్థిక ప్రతిఘటన సాధనం)ను సిద్ధం చేస్తోంది. సుమారు 93 బిలియన్ యూరోల విలువైన అమెరికా ఉత్పత్తులపై పన్నులు వేయడానికి సిద్ధం అని ప్రకటించడం ద్వారా అట్లాంటిక్ సముద్రం ఇరువైపులా ఒక భారీ వాణిజ్య యుద్ధం మొదలైంది. దీని ప్రభావంతో ఇప్పటికే డౌ జోన్స్ (స్టాక్ మార్కెట్ సూచి) 870 పాయింట్లు పతనం కావడం, గ్లోబల్ సప్లై చైన్ దెబ్బతినడం ఆందోళన కలిగించే పరిణామం.

## ప్రశ్నార్థకమైన నాటో భవితవ్యం

ఈ పరిణామాలన్నీ 'నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్' ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. 1949లో రష్యా వంటి దేశాల నుండి రక్షణ కోసం ఏర్పడిన నాటో కూటమి, నేడు అమెరికా చర్యలవల్లే కుప్పకూలేలా ఉంది. అమెరికా తన మిత్రదేశాలైన డెన్మార్క్, కెనడాలనే గౌరవించనప్పుడు, రష్యా లేదా చైనా వంటి శత్రువుల నుండి నాటో రక్షణ కల్పిస్తుందన్న నమ్మకం ఐరోపా దేశాల్లో సడలిపోతోంది. గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌కు చెందిన స్వయంపాలన భూభాగం. ఒక సభ్యదేశ భూభాగాన్ని అమెరికా బలవంతంగా ఆక్రమించాలని చూడటం నాటోలోని 'ఆర్టికల్ 5' (ఒకరిపై దాడి అందరిపై దాడి) స్ఫూర్తిని చంపేయడమే. ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ దీన్ని "అలయన్స్-షాటరింగ్" (కూటమిని ముక్కలు చేసే చర్య) అని అభివర్ణించారు. ఐరోపా దేశాలు "ఆపరేషన్ ఆర్కిటిక్ ఎండ్యూరెన్స్" పేరిట యుద్ధ విన్యాసాలు చేపట్టడం, డెన్మార్క్ తన సైన్యాన్ని గ్రీన్‌లాండ్‌కు తరలించడం చూస్తుంటే.. మిత్రదేశాల మధ్యే యుద్ధ వాతావరణం నెలకొన్నట్లు స్పష్టమవుతోంది. పరస్పర రక్షణ కోసం ఏర్పడిన కూటమిలో సభ్యదేశాలు ఒకరిపై ఒకరు పన్నుల యుద్ధానికి దిగడం నాటో పతనానికి నాంది కావచ్చు. ఇది రష్యా, చైనాలకు వ్యూహాత్మకంగా పెద్ద లాభాన్ని చేకూర్చే అవకాశం ఉంది.

## అంతర్జాతీయ మర్యాదలకు తిలోదకాలు..

ట్రంప్ వ్యవహారశైలి అంతర్జాతీయ దౌత్య నియమాలను తుంగలో తొక్కింది. ఐరోపా నేతలు తనకు పంపిన ప్రైవేట్ సందేశాలను (ముఖ్యంగా మాక్రాన్, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే సందేశాలను) సోషల్ మీడియాలో రచ్చ చేయడం ఒక అగ్రరాజ్యాధినేతకు తగని పని. అంతకన్నా భయంకరమైన విషయం.. కెనడా, గ్రీన్‌లాండ్, వెనిజులాలను అమెరికా మ్యాప్‌లో కలిపేసి ఉన్న ఏ.ఐ చిత్రాలను ఆయన పంచుకోవడం. ఇది కేవలం మీమ్ కోసం షేర్ చేసుకున్న చిత్రం అనుకోవడానికి వీల్లేదు. కెనడాను అమెరికాలో 51వ రాష్ట్రంగా మార్చాలనే ఆయన 'సామ్రాజ్యవాద' కాంక్షకు నిదర్శనం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మరే నేత కూడా ఇంత బహిరంగంగా పొరుగు దేశాల సార్వభౌమాధికారాన్ని వెక్కిరించలేదు.

## తిరిగి వస్తున్న సామ్రాజ్యవాదం?

18వ, 19వ శతాబ్దాల్లో బలవంతులైన రాజులు బలహీనమైన రాజ్యాలను ఆక్రమించుకున్నట్లుగా, నేడు అమెరికా తన ఆర్థిక, సైనిక శక్తిని ఉపయోగించి ఇతర దేశాల భూభాగాలపై కన్నేయడం ఆందోళనకరం. అమెరికా ఒకప్పుడు మార్షల్ ప్లాన్ ద్వారా ఐరోపాను పునర్నిర్మించింది. కానీ నేడు అదే అమెరికా "మన్రో డాక్ట్రిన్"ను పునరుద్ధరిస్తూ వెనిజులా నుండి గ్రీన్‌లాండ్ వరకు తన గుత్తాధిపత్యాన్ని చాటాలని చూస్తోంది. ఇది 'అమెరికా ఫస్ట్' పేరుతో జరుగుతున్న బరితెగించిన సామ్రాజ్యవాద ధోరణి. నిజానికి ట్రంప్ వైఖరి 'అమెరికా ఫస్ట్' లా లేదు. 'అమెరికా ఓన్లీ' లా ఉంది. ఐరోపా సమాఖ్య, అమెరికా మధ్య రాజుకున్న ఈ మంటలు చల్లారకపోతే, అది కేవలం ఆర్థిక నష్టానికే పరిమితం కాకుండా, ప్రపంచ శాంతిని, అంతర్జాతీయ సరిహద్దుల భద్రతను ప్రమాదంలో పడేస్తుంది. బలవంతుడిదే రాజ్యం అన్న అనాగరిక కాలపు ధోరణి మళ్లీ వేళ్లూనుతుంది. గ్రీన్‌లాండ్ వివాదం కేవలం మంచు గడ్డల కోసం జరుగుతున్న పోరాటం కాదు, ఇది ప్రపంచ ప్రజాస్వామ్య విలువల మనుగడ కోసం జరుగుతున్న యుద్ధం. దావోస్ సమావేశాలు లేదా బ్రసెల్స్ ఎమర్జెన్సీ సమ్మిట్ ఈ సంక్షోభాన్ని ఆపలేకపోతే, ప్రపంచం ఒక కొత్త అస్థిరతలోకి జారుకుంటుంది. అగ్రరాజ్యం తన బాధ్యతను మరిచి సామ్రాజ్యవాద కాంక్షతో ముందుకు వెళ్తే, అది చరిత్రలో మరో చీకటి అధ్యాయానికి దారితీస్తుంది.



- తుమ్మల బాల గంగాధర్ తిలక్




## గంజాయి-డ్రగ్స్‌పై..
## ప్రజాసంఘాల ఆందోళన

గంజాయి-డ్రగ్స్ వంటి మత్తు-మాదకద్రవ్యాలపై జిల్లాలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. వాటివల్ల విద్యార్థులు, యువత జీవితాలు నాశనమవుతున్నాయంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాలు నేటి సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయని, వాటి నివారణకు జిల్లాలోని అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు. భోగిపండుగ రోజున నెల్లూరులో గంజాయి-డ్రగ్స్ దిష్టిబొమ్మను తయారుచేసి దానిని భోగి మంటల్లో దహనం చేసి, తమ నిరసనను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం, ఆటో కార్మికులు, రోడ్డుమార్జిన్ వ్యాపారులు, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వీటిపై అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలోకి గంజాయి కానీ, ఇతర మాదకద్రవ్యాలు కానీ ప్రవేశించకుండా కట్టు దిట్టం చేయాలని వారు కోరారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకుడు సుధాకర్, పలువురు డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

## యూరియా కోసం..
## రైతన్నల ఆందోళన

ఉదయగిరి సమీపంలోని తిరుమలాపురం పంచాయతీలో ఉన్న గుడినరవ గ్రామానికి చెందిన రైతులు యూరియా కోసం ఈనెల 17న ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఈ సీజన్‌లో పంటల సాగు బాగుందని, అయితే మండల రైతు సేవాకేంద్రంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని వారు పేర్కొన్నారు. గత వారం రోజులుగా యూరియా లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లి తీసుకోవాల్సి వస్తోందని, దాంతో వ్యయప్రయాసలు అధికమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు వెంటనే ఈ సమస్యని పరిశీలించి గ్రామరైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉపాధి పథకం మార్పుపై..
## సీపీఎం నిరసనలు

ఎంతోకాలం నుంచి ఉన్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రప్రభుత్వం ఇటీవల మార్పులు చేయడం, వీబీ జీ రాంజీ చట్టంగా దానిని మార్పు చేయడమే కాక, ఆ పథకం అమలుకు రాష్ట్రాలపై భారం పడేవిధంగా నిర్ణయాలు తీసుకోవడం దారుణమంటూ నెల్లూరు రూరల్ మండల సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న ఆందోళన వ్యక్తం చేశారు. సౌత్‌మోపూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి ఉపాధి పథకంలో చేసిన మార్పులవల్ల కలిగే అనర్థాలను సీపీఎం కార్యకర్తలు ప్రజలకు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికులు, కష్టజీవులు వాటిని గుర్తించి, ఈ పథకం పాత పద్ధతిలోనే కొనసాగాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. సీపీఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు ఆలూరు తిరుపాలు, పూడిపర్తి జనార్దన్, మస్తానయ్య, లక్ష్మీప్రసాద్, అనంతయ్య, ఆదిశేషయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## టీపీగూడూరులో ఇంటింటి ప్రచారం

ఉపాధిహామీ పథకాన్ని మార్పులు లేకుండా యథాతథంగానే ఉంచి అమలుచేయాలని కోరుతూ ఈనెల 20న తోటపల్లిగూడూరు మండలంలోని కృష్ణారెడ్డిపాళెం, పాపిరెడ్డిపాళెం తదితర గ్రామాల్లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ పథకంలో 40 శాతం నిధులను రాష్ట్రాలు భరించాలంటూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఈ పథకం నీరసపడిపోతుందని ఆమె వివరించారు. కేంద్రం కొత్తగా దీని స్థానంలో తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆటోయూనియన్ కార్యదర్శి ఎం. రాజా, సీపీఎం నాయకుడు లక్ష్మయ్య, రాధయ్య పాల్గొన్నారు.

## బెడుసుపల్లిలో..
# కాశీనాయన జయంతి వేడుకలు


108 కలశాలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

ప్రముఖ అవధూత.. సద్గురు శ్రీ కాశీనాయన జన్మస్థలమైన సీతారామపురం మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో ఈనెల 18న కాశీనాయన 130వ జయంతి వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. వేలాదిమంది భక్తులు ఆలయానికి వచ్చి అవధూత స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక రథంపై శ్రీ కాశీనాయన విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేకపూజలు చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. దీపోత్సవాలు చేశారు. అనంతరం కాశీనాయన మందిరం వద్ద 108 మంది మహిళలు సంప్రదాయబద్దంగా కలశపూజలు చేశారు. దివిటీలు చేతపట్టి గ్రామస్తులు ఈ ఉత్సవాలని వైభవంగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే విజయరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిని కాశీనాయన కుటుంబసభ్యులు, ఆలయ నిర్వాహకులు స్వాగతించి, కాశీనాయన మందిరంలో పూజలు నిర్వహింపజేశారు.

# భవన నిర్మాణ కార్మికుల ధర్నాందోళన

భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ నిధిని ఆ కార్మికులకే వెచ్చించాలని కోరుతూ నెల్లూరుజిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఆ కార్మిక సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ఈ ఆందోళనలో నాయకులు మాట్లాడుతూ, సంక్షేమ బోర్డులో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది కార్మికులు ఉన్నారని, అయితే గత ఏడేళ్లుగా కార్మిక సంక్షేమ బోర్డు నుంచి రూపాయైన కార్మికులకు ఖర్చు చేసింది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పనిచేస్తూ ప్రమాదాలకు గురైన ఎంతోమంది కార్మికులు తమ పేర్లు నమోదు చేసుకున్నా వారికి సాయం లభించలేదని, జిల్లా కలెక్టర్ చొరవ చూపి కార్మికులను ఆదుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆమేరకు డీఆర్ఓకి వినతిపత్రాన్ని సమర్పించారు. సంఘం నాయకులు కాయం శ్రీనివాసులు, అల్లాడి గోపాల్, పెంచలయ్య, షమీవుల్లా, బాలరాజు, మధుసూదన్, మునికృష్ణ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియాకి
# కరువు లేదయా!

ఈ రబీ సీజన్‌కి సంబంధించి పంట పొలాలకు అవసరమైన యూరియా ఎరువు జిల్లాలో పుష్కలంగా ఉందని, ఎలాంటి కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారిణి సత్యవాణి చెప్పారు. జిల్లాలో అన్ని పంటలకు 94,383 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా ఉందని, అందులో ఈనెలాఖరు వరకు కనీసం 76,358 టన్నులు అవసరమవుతాయని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఇప్పటికే జిల్లాలో 82,140 టన్నుల యూరియాని రైతులకు సరఫరా చేశామని, మరో 12,250 టన్నుల యూరియా జిల్లాకి రావాల్సి ఉందని, ప్రస్తుతం 14,701 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని కూడా ఆమె తెలిపారు.

## 91వ సారి..
# దేవిరెడ్డి రక్తదానం

కోవూరుకు చెందిన సుభాష్ సేవా సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి బాధితుల కోసం అనేకసార్లు రక్తదానం చేసి తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. నెల్లూరు రక్తనిధిలో ఈనెల 18న ఆయన 91వసారి రక్తదానం చేసి, రక్తదానం విశిష్టతను అందరికీ తెలియజెప్పారు. రక్తదానం చేస్తే, బాధితులకు ప్రాణదానం చేసినట్లేనని, విద్యార్థులు, యువత ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా రక్తదానం చేసి, బాధితులకు సాయపడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం


బాలకృష్ణారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌బికేఆర్ ఇన్‌స్టి సిబ్బంది

విద్యాదాత, సమాజసేవాభిలాషి పద్మశ్రీ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి (ఎన్‌బీకేఆర్) సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. ఇటీవల కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిలో బాలకృష్ణారెడ్డి 112వ జయంతి వేడుకలు జరిగాయి. ఎన్‌బీకేఆర్‌లోని ఆయన విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎన్‌బీకేఆర్ డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి తదితరులంతా వారి విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల ఆరంభకర్తగా, హరిజన విద్యార్థుల ఉద్ధారక సంఘం ద్వారా పేద విద్యార్థుల చదువుల కోసం ఆయనెంతగానో పరితపించారని, వాకాడు, విద్యానగర్ ప్రాంతాల్లో విద్యా సంస్థల స్థాపనకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు, ఉభయ తెలుగు రాష్ట్రాల విద్యార్థుల అభ్యున్నతికి ఆయన చేపట్టిన సామాజిక సేవ, విద్యా కార్యక్రమాలు ఏనాటికీ మరచిపోలేనివని అన్నారు. ఆయన సేవలను గుర్తించి అప్పటి ప్రభుత్వం వారికి పద్మశ్రీ బిరుదును ప్రదానం చేసిందని, ఎన్‌బీకేఆర్ ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులంతా ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పెన్నానది వద్ద..ఇసుక రీచ్‌ల తనిఖీ

నెల్లూరు అర్బన్ మండల పరిధిలోని పెన్నానదీ పరీవాహక ప్రాంతాలైన పొర్లుకట్ట, బోడిగాడితోట, దీన్‌దయాళ్‌నగర్, భగత్‌సింగ్ కాలనీలోని పలు ఇసుక రీచ్‌లని ఈనెల 19న జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఆ రీచ్‌ల నిర్వహణ ఎలా జరుగుతోందో కూలంకషంగా పరిశీలించారు. ఇసుక తవ్వకాలు, రవాణా, డంపింగ్ తదితర విషయాలపై అర్బన్ తహశీల్దార్ షఫీమాలిక్‌తో మాట్లాడారు. రీచ్‌ల నిర్వహణ సక్రమంగా ఉండాలంటూ, అధికారులకు తగు సూచనలిచ్చారు. కార్పొరేషన్ కమిషనర్ వైఓ నందన్, నెల్లూరు రెవిన్యూ డివిజన్ అధికారిణి నాగసంతోష్ అనూష, నీటిపారుదల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

# గూడూరు డివిజన్

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం
## - ఎమ్మెల్యే పాశిం


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాశిం

వైకాపా పాలనలో సీఎం సహాయనిధి ద్వారా ఒక్కరికి కూడా సాయం చేసిన దాఖలాలు లేవని, కూటమి ప్రభుత్వంలో 4కోట్ల రూపాయలకు పైగా చెక్కులను పంపిణీ చేసినట్లు గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు. గూడూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఇటీవల నియోజకవర్గంలోని 51 మంది బాధితులకు రూ.39లక్షలకుపైగా సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. నాయకులు శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, గుండాల లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# మూడు మండలాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా

జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇటీవల అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గూడూరు, చిల్లకూరు, కోట మండలాలు తిరుపతి జిల్లా నుండి నెల్లూరుజిల్లాకు మారడంతో ఈ మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. క్రిస్ సిటీ పనులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సాగరమాల రహదారి పనులకు సంబంధించి సమస్యలపై అధికారులతో చర్చించారు. నెల్లూరుజిల్లాలో విలీనం అయిన మూడు మండలాల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు.

# గూడూరును జిల్లా చేయండి
## • వెంకయ్యనాయుడుకి కోడూరు వినతి



బ్రిటీషు కాలం నుండే ఎంతో ప్రాముఖ్యత సాధించి వైభవంగా ఉన్న గూడూరును నేడు ముక్కలు ముక్కలుగా చేశారని గూడూరు ప్రజాసమితి కన్వీనర్ కోడూరు మీరారెడ్డి తెలిపారు. వెంకటాచలం స్వర్ణభారత్ ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును కలిసి గూడూరును జిల్లా చేసేలా సహకరించాలని ఇటీవల వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 మండలాలతో ఉన్న గూడూరు డివిజన్ కేంద్రాన్ని, కేవలం మూడు మండలాలకే పరిమితం చేశారని వివరించారు. సీఎం చంద్రబాబుతో చర్చించి గూడూరు ప్రజలకు న్యాయం చేయాలని మీరారెడ్డి కోరారు.

# శ్రీకృష్ణ గోశాలలో వైభవంగా పూజలు



చిల్లకూరు వరగలి క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న శ్రీకృష్ణ గోశాలలో కనుమ పండుగ సందర్భంగా ఈ నెల 16న బూడిదవాక వెంకటరత్నమాచారి, ప్రభావతి దంపతులు మరియు ప్రగతి సేవాసంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో మన సంస్కృతి సంప్రదాయాలకనుగుణంగా గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ గోశాలను నిర్వహిస్తున్న రత్నమాచారి దంపతులు అభినందనీయులన్నారు. కోలాట బృందాలు, ప్రజలు పాల్గొన్నారు.



# నేత్రపర్వం.. సీతారాముల తెప్పోత్సవం

గూడూరు, కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి దేవస్థానం వద్ద, కనుమ పండుగ నాడు కోనేరులో సీతారాముల వారి తెప్పోత్సవం కనుమూరు హరిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. అదేవిధంగా, వైభవంగా జరిగిన చెన్నూరు కటాలమ్మతల్లి గ్రామోత్సవంలో గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో గోపూజ, కోలాటం, రంగవల్లుల పోటీలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ చిల్లకూరు దశరథరామిరెడ్డి, ఈవో నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు.

# రవాణా శాఖ రక్తదాన శిబిరం


రక్తదాతలకు సర్టిఫికేట్లను అందజేస్తున్న రవాణాశాఖాధికారులు

రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 37వ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఇటీవల గూడూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయంలో రక్తదాన శిబిరం, ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. సుమారు వందమంది పాల్గొన్నారు. గూడూరు ఆర్టీవో బిఎస్‌కే కిషోర్, ఎంవిఐ జాకీర్, ఏఎంవిఐలు ప్రభాకర్, శాంతిలు ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కలిగించారు. సీటు బెల్టు, హెల్మెట్ లేకుండా వాహనం డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాల గురించి తెలియపరిచారు. ప్రమాదం జరిగినపుడు ప్రతిఒక్కరూ తగు రీతిగా స్పందించి ప్రాణదాతగా వ్యవహరించాలని తెలియజేశారు.

## శ్రీసిటీ-ఐమాప్ పరిశ్రమ సహకారంతో..

# ప్రభుత్వ స్కూళ్లకు నూతన శోభ

- 27.5 లక్షలతో వసతుల కల్పన




తరగతి గదులను ప్రారంభిస్తున్న శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి

శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ చేయూతతో పలు విద్యా వసతులు ఏర్పాటై తడ మండలం రామాపురం ప్రభుత్వ జడ్పీ హైస్కూల్, మోడల్ ప్రాథమిక పాఠశాలలు నూతన శోభను సంతరించుకున్నాయి. గతంలో అర్ధాంతర నిర్మాణంతో ఆగిపోయిన తరగతి గదులు, చాలీచాలని మరుగుదొడ్లు, అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో ఐమాప్ సంస్థ ముందుకొచ్చి, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా 27.5 లక్షల రూపాయలు దీని బాగుకోసం వెచ్చించింది. ఒక నూతన భవనం నిర్మాణంతో పాటు అర్ధాంతరంగా ఆగివున్న 7 తరగతి గదులు, టాయిలెట్లు, వంటగది, ప్రహరీ గోడలకు మరమ్మతులు చేపట్టింది. ఇంకా తరగతి గదుల్లో డెస్కులు, బల్లలు ఏర్పాటు చేసింది. ఈనెల 22వ తేదీ గురువారం శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఐమాప్ ఉన్నతాధికారుల సమక్షంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామి ఈ నూతన వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇవామీ మాట్లాడుతూ, స్థానిక విద్యాసంస్థల మౌళిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఐమాప్ చొరవను అభినందించిన నిరీషా, శ్రీసిటీ ప్రత్యేక చొరవకు పరిశ్రమల చురుకైన భాగస్వామ్యం తోడై ఈ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యా సంస్థల మౌళిక సదుపాయాలు చాలా వరకు మెరుగుపడ్డాయన్నారు. ఈ విద్యావసతులను వినియోగించుకుని విద్యాపరంగా మంచి పురోగతి సాధించాలని విద్యార్థులకు సూచించారు. తడ ఎంఈఓలు వేముల, మల్లికార్జున, హెడ్ మాస్టర్లు మాధవి, పారిజాతమ్మ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. విద్యావసతుల కల్పనపై సంతోషం వ్యక్తం చేస్తూ, శ్రీసిటీ ఫౌండేషన్ మరియు ఐమాప్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇప్పటి వరకు శ్రీసిటీ ప్రాంతంలో పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతుల కల్పనకు ఐమాప్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో సుమారు 3.30 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది.

## డాక్టర్ సీ.యం.కే రెడ్డి సహస్ర పూర్ణ చంద్రదర్శన సంబరం!



తమిళనాట తెలుగువారి ముద్దుబిడ్డ, ఆరు దశాబ్దాలకి పైగా వైద్యరంగంలో సేవలందిస్తూ తనదైన స్థానాన్ని పొందిన వైద్యరాజం ఆచార్య సి.యం.కే రెడ్డి. ఆయన వెయ్యి పున్నమి చంద్రుళ్ళని దర్శించుకున్న సందర్భంగా ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు ఆత్మీయ ఆనంద సంబరం జరుపుకున్నారు. జనవరి 15వతేదీ గూడూరు ప్రాంతం కడివేడులోని A5 హోటల్లో జరిగిన ఆ వేడుకలో తన సతీమణి నిర్మల, కుమారుడు డాక్టర్ కిషోర్, కోడలు లీలాదేవి, కుమార్తె హరిత, అల్లుడు డాక్టర్ రామానందరెడ్డిలతో డాక్టర్ ముద్దుకృష్ణారెడ్డి.

# వెంకటగిరిలో 24న.. 'రచ్చబండ' కార్యక్రమం

## విజయవంతం చేయాలన్న రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ ఉదయం 9.30 గంటలకు వెంకటగిరిలోని ఎన్‌జేఆర్ భవన్‌లో గ్రామ స్థాయి సంస్థాగత నిర్మాణం మరియు రచ్చబండ కార్యక్రమానికి సంబంధించి అసెంబ్లీ స్థాయి అవగాహన సమావేశం నిర్వహించనున్నారు. తొలుత భారీఎత్తున ర్యాలీ నిర్వహించేందుకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా తిరుపతి జిల్లా పార్టీ పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి, ఎంపీ మద్దెల గురుమూర్తి తదితర నేతలతో పాటు వెంకటగిరి నియోజకవర్గంలోని వెంకటగిరి మున్సిపాలిటీ, రూరల్, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాల నాయకులు, కార్యకర్తలంతా పాల్గొని ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని వెంకటగిరి వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు.

- ఇస్కపల్లి తీరంలో విషాదం

# నలుగుర్ని మింగేసిన సముద్రం!

అల్లూరు మండలం ఇస్కపల్లి సముద్రతీరంలో పండుగ వేళ విషాదం జరిగింది. ఈనెల 16న సముద్రం వద్దకి ఈతకు వెళ్ళిన నలుగురు సముద్రంలో మునిగిపోయి.. గల్లంతయ్యారు. ఆ తర్వాత శవాలుగా తేలారు. దీంతో ఆ ప్రాంతమంతా విషాదం అలముకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.

బుచ్చిరెడ్డిపాలెంకి చెందిన ఈగ చిన్నబ్బయ్య, ఈగ బాలకృష్ణ, అమూల్య, పోచమ్మ అందరూ ఒకే కుటుంబంలోని వారు. పండుగ పూట వీరంతా ఎర్రపుగుంటలోని బంధువులింటికి వెళ్లి, మరో ఇద్దరు స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వెళ్ళారు. అమూల్య, బాలకృష్ణ, అభిషేక్, సుధీర్, వెంకటేశు, చిన్నబ్బయ్య.. ఈ ఆరుగురూ ఉత్సాహంగా సముద్రంలోకి దిగిన కొద్దిసేపటికే పెద్ద అలలు రావడంతో వారిలో నలుగురు మునిగిపోయారు. ఈ దుర్ఘటనలో ఈగ అమూల్య, బాలకృష్ణ అభిషేక్, సుధీర్ మరణించారు. ఈ సమాచారం తెలియడంతో వారి తల్లితండ్రులు, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. మొదట అమూల్య, బాలకృష్ణల మృతదేహాలు లభించాయి. ఆ తర్వాత గాలింపులో అభిషేక్, సుధీర్‌ల శవాలు బయటపడ్డాయి. ఈ దుర్ఘటన తెలియగానే టీడీపీ జిల్లా అధ్యక్షులు.. ఈ ప్రాంత వాసి అయిన బీద రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. సముద్ర స్నానం కోసం ఇస్కపల్లి బీచ్‌కి వెళ్లిన ఆరుగురు విద్యార్థులలో నలుగురు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోవడం తననెంతో బాధించిందన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న ఈగ బాలకృష్ణ, కొమరగిరి అభిషేక్, ఈగ అమూల్య, సుధీర్‌లు చిన్న వయస్సులోనే ఇలా దుర్మరణం పాలుకావడం వారి కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చిందంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

# 'హ్యాపీ ఈవినింగ్ వాకర్స్'..కొత్త కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు

నెల్లూరులోని అంతర్జాతీయ వాకర్స్ సంస్థ హ్యాపీ ఈవినింగ్ వాకర్స్ అసోసియేషన్ కొత్త కార్యవర్గ ప్రమాణస్వీకారం ఈనెల 21న జరిగింది. అధ్యక్షులుగా ఎన్.బుజ్జిరెడ్డి, కార్యదర్శిగా కె.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఎన్.రాజేంద్రప్రసాద్, గౌరవాధ్యక్షులుగా బి.శంకరయ్య ప్రమాణ స్వీకారం చేశారు. వాకర్స్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు వారందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ ఏడాది మరిన్ని సేవాకార్యక్రమాలతో వాకర్స్ ఇంటర్నేషనల్‌లో మంచిపేరు తెచ్చుకుంటామని ఈ సందర్భంగా అధ్యక్షులు బుజ్జిరెడ్డి చెప్పారు. తిరుపతి శేఖర్ సభను నిర్వహించారు. వాకర్స్ ప్రతినిధులు ఏకొల్లు రాఘవరెడ్డి, పలగాటి శ్రీనివాసులు, కె.రఘురామ ముదిరాజ్, జీవీ కృష్ణయ్య, దాసరి అనంతరామారావు, పి.భాస్కర్‌రెడ్డి, ఎల్.నరసింహులు, జి. వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికో మంచి సందేశం.. 'చెట్టు=తల్లి'

## అవార్డు విజేతలని.. అభినందించిన వక్తలు



'చెట్టు=తల్లి' బృందంతో ముఖ్యఅతిథులు

నెల్లూరుకి చెందిన ప్రముఖ దర్శకుడు - రచయిత 'కళాంజలి' అనంత్ దర్శకత్వంలో ఇటీవల రూపొందించిన 'చెట్టు=తల్లి' షార్ట్ ఫిల్మ్ నాలుగు అవార్డులు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇటీవల స్థానిక నేతాజీ పైలెట్ స్కూల్‌లో 'చెట్టు=తల్లి' అవార్డు విజేతలకి, 'చెట్టు=తల్లి' నటీనటులు-సాంకేతిక బృందానికి అభినందన సభ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'ప్రతి ఒక్కరూ తల్లిపేరుతో ఒక మొక్క నాటాలని' ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన పిలుపునకు స్పందించి, మనకు ఊపిరిచ్చే చెట్లను ప్రాణమిచ్చయినా సరే కాపాడుకోవాలనే ఇతివృత్తంతో అనంత్ ఈ షార్ట్‌ఫిల్మ్‌ని అద్భుతంగా రూపొందించారు. చెట్లను తల్లితో సమానంగా చూడాలంటూ (చెట్టు ఈజ్ ఈక్వల్ టు తల్లి) 'చెట్టు=తల్లి' అనే పేరుతో రూపొందించిన ఈ లఘుచిత్రానికి ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల మంచిర్యాలలోని రవికిరణ్ ఆర్ట్స్ వారు సినీప్రముఖులు బాపు-రమణల స్మారకార్థం ఇచ్చే ప్రతిష్టాత్మక అవార్డులకు ఈ షార్ట్ ఫిల్మ్ ఎంపికైంది.

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 39 షార్ట్ ఫిల్మ్‌లు పోటీకి రాగా, 'చెట్టు=తల్లి' నాలుగు అవార్డులు సాధించడం విశేషం. ద్వితీయ ఉత్తమ ప్రదర్శన అవార్డుతో పాటు, ఈ లఘు చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం వహించిన కళాంజలి అనంత్‌కి ప్రత్యేకించి ఉత్తమ రచయిత అవార్డు లభించింది. ఇందులో అద్వితీయంగా నటించిన నటీనటులు సుఖియా-ధీరజ్‌లకి జ్యూరీ అవార్డులు వచ్చాయి. పర్యావరణ పరంగా ఈ షార్ట్ ఫిల్మ్ సమాజానికో మంచి సందేశం ఇస్తోందంటూ ముఖ్య అతిథులు అందరినీ మెచ్చుకుంటూ సన్మానించారు. ప్రతి మాటా-పాటా-దృశ్యాలు అన్నీ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉన్నాయని, ముఖ్యంగా అనంత్ దర్శకత్వ ప్రతిభని చూస్తుంటే, 'నెల్లూరు దాసరి నారాయణ రావు' అనిపిస్తోందని వక్తలు కొనియాడారు. అనంతరం 'చెట్టు=తల్లి' బృందంలోని సీనియర్ నటుడు.. నంది అవార్డు గ్రహీత కె.కె రామచంద్రమూర్తి (హైదరాబాద్)ని, విలక్షణ నటుడు బెనర్జీ, ఎడిటర్-కెమెరామెన్ రాజేష్‌లతో పాటు..పాటల రచయిత మద్దూరు శ్రీనివాసులు, సంగీతం-గానంతో సహకరించిన సంగీత్ సౌరభ్, నటీమణులు శిరీష, నీలిమ తదితరులందరినీ ముఖ్యఅతిథులు సత్కరించారు. నేతాజీ పైలెట్ స్కూల్ అధినేత నేతాజీ సుబ్బారెడ్డి, శుభమస్తు' అధినేత బయ్యా వాసు, కళాంజలి సంస్థకి ఆత్మీయులైన వీరిశెట్టి హజరత్‌బాబు, ప్రముఖ సినీ రచయిత రాజేంద్రకుమార్, క్షేత్రప్రచార శాఖ అధికారి హరికృష్ణ, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా.గంగిశెట్టి శివకుమార్, వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, కార్పొరేటర్ ఎం. కామాక్షిదేవి, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, ఎం.ప్రసన్నాంజనేయులు, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొని 'చెట్టు=తల్లి' బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

# పరిశ్రమలకు వసతులు కల్పించాలి

**• అధికారులను ఆదేశించిన కలెక్టర్**



జిల్లాలో ఏర్పాటవుతున్న పరిశ్రమలకు మౌలిక వసతులను త్వరితగతన కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరులోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో 14 మంది పారిశ్రామికవేత్తలు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారని, ఆ పరిశ్రమలన్నింటికి అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చెప్పారు. భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వసతి, విద్యుత్ మొదలైన కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. అదేవిధంగా ఉద్యమ్ పోర్టల్‌లో అన్ని యూనిట్లను నమోదు చేయాలని సూచించారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి ఈపీఎఫ్ రిజిస్ట్రేషన్ కూడా తప్పనిసరిగా చేయించాలన్నారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ అశోక్‌కుమార్, ఖాదీ వికాస్ బోర్డు డీడీ ప్రసన్నలక్ష్మి, ఆర్డీవోలు అనూష, పావని, పలు పరిశ్రమల నిర్వాహకులు పాల్గొన్నారు.

### స్కానింగ్ సెంటర్‌లను తనిఖీ చేయాలి :

జిల్లాలోని స్కానింగ్ సెంటర్‌లను తరచూ తనిఖీలు చేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ చాంబర్లో జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ వారి అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారిణి డాక్టర్ సుజాత, డాక్టర్ ఆండాళ్, కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పండుగ పక్షులు

రెక్కల చప్పుడుకి
తలెత్తి చూసింది
మా పల్లె...

వాలిన వలస పక్షుల
పాద స్పర్శతో పులకరించిపోయింది
మా పల్లె...

తొలకరి చినుకు తాకిన
నెర్రెబారిన నేలయ్యింది
మా పల్లె...

కూనల కిలకిలలతో
కళకళలాడింది
మా పల్లె...

కమ్మటి వాసనలని
గాలికి అంటించింది
మా పల్లె...

ఉత్తరంవైపు మళ్ళిన సూర్యరథాన్ని
ఘుమఘుమలతో ఆకర్షించింది
మా పల్లె...

మూన్నాళ్ళు ముచ్చటగా
మురిసిపోయింది
మా పల్లె...

మళ్ళీ పండక్కేనంటూ
వెళ్ళిపోతుంటే...
నిట్టూరుస్తూ నిలబడిపోయింది
మా పల్లె...



**ఆర్.ఎం.వి.భాస్కర్‌బాబు**
9849166103

# భవన నిర్మాణాలు పూర్తి చేయండి

## స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో జడ్పీ సభ్యుల ధ్వజం



జడ్పీ వైస్‌ఛైర్‌పర్సన్ ప్రసన్న అధ్యక్షతన జరిగిన జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

జిల్లాలో అత్యధికశాతం సచివాలయ భవనాల నిర్మాణాలు, రైతు భరోసా కేంద్రాలకి సంబంధించిన భవనాలు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయని ఈనెల 20న జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో జడ్పీ సభ్యులు తమ అసహనం వ్యక్తం చేశారు.

జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ వ్యక్తిగత కారణాలతో ఈ సమావేశానికి రాలేకపోవడంతో, వైస్ ఛైర్‌పర్సన్ చిగురుపాటి ప్రసన్న అధ్యక్షతన జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఈ సమావేశాల్లో పలు శాఖలకు సంబంధించిన అంశాలపై సమావేశంలో చర్చలు జరిగాయి. ప్రభుత్వం నుంచి తగిన ఆదేశాలు రాగానే వాటి నిర్మాణాల పనులు పూర్తిచేస్తామని జడ్పీ సీఈఓ శ్రీధర్‌రెడ్డి సభ్యులకి వివరించారు. పాత సచివాలయాల భవనాలకి సంబంధించిన బిల్లులను త్వరితగతిన మంజూరు చేయాలని, జల్‌జీవన్ మిషన్ పనులను కూడా ఆలస్యం అవుతున్నాయని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఇటీవల భారీవానలకి గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల బాగా దెబ్బతిన్నాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని, పేదలకు ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం జరుగుతోందని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా, సర్వే పూర్తికాగానే అర్హులందరికీ ఇళ్లను నిర్మించి ఇస్తామని అధికారులు తెలిపారు. మండల సమావేశాలకి కూడా డివిజన్ స్థాయి అధికారులు రాకుండా దుమ్మా కొడుతున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు యూరియా ఎరువు జిల్లాలో పుష్కలంగా ఉందని ప్రకటనలిస్తున్నారే తప్ప, యూరియా అన్ని ప్రాంతాల రైతులకు అందుబాటులో ఉండడం లేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జడ్పీవైస్ ఛైర్‌పర్సన్లయిన రాపూరు జడ్పీటీసీ చిగురుపాటి ప్రసన్న, ఉదయగిరి కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఇందుకూరుపేట జడ్పీటీసీ జయలక్ష్మమ్మతో పాటు, మర్రిపాడు జడ్పీటీసీ మల్లు సుధాకర్‌రెడ్డి, కలిగిరి జడ్పీటీసీ వెంకట్రావు పాల్గొన్నారు.

# వసంత పంచమి రోజున..సరస్వతీదేవికి పూజలు

ఈనెల 23వ తేదీ వసంత పంచమి రోజున సరస్వతీదేవి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామని నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఈనెల 20న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో జరిగిన కాత్యాయని వ్రత పూజల సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వసంత పంచమి రోజున విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, చిన్నారులకు పలకలు అందజేస్తామన్నారు.

# పెన్నా తీరాన..'ఏటి పండుగ' సందడి!



సంక్రాంతి పండుగల ముగింపు వేడుకగా నెల్లూరు పెన్నానదిలో ఆనందోత్సవంగా జరుపుకునే 'ఏటి పండుగ'కు ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఇటీవల జరిగిన ఆ సంరంభంతో పెన్నా తీరం జనసంద్రమైంది. ఈ కార్యక్రమాల్లో భాగంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో 12 ప్రముఖ ఆలయాలకు చెందిన 12 మంది దేవతామూర్తుల నమూనాలను ఒకే చోట ప్రతిష్ఠించారు. పురపాలక మంత్రి నారాయణ తదితరులు ఆ దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, సంప్రదాయబద్ధంగా జరిగిన గొబ్బెమ్మల నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి మంత్రి పతంగులు ఎగరవేసి సందడి చేశారు. ఈ సందర్భంగా కళాకారుల జానపద నృత్యాలు, తోలుబొమ్మలాట, పులి వేషాలు, బుడబుక్కల, దేవర వేషధారణలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యం, తప్పెటగుళ్ళు, లంబాడీ, డప్పులు, మరియు మార్వాడీ గంజీర ప్రదర్శనలు నేత్రానందం కలిగించాయి. దొర్నాల హరిబాబు 'హాస్యవల్లరి' నవ్వులు పూయించగా, సంగీత విభావరి వీనులవిందు చేసింది. రాష్ట్రమంతా సంక్రాంతి పండుగను మూడు రోజులు జరుపుకుంటే..నెల్లూరు వాసులు మాత్రం 4వ రోజు 'ఏటి పండుగ'ను అదనంగా మరింత వైభవంగా జరుపుకుంటారు. పెన్నా నదిలో గొబ్బెమ్మల నిమజ్జనం ఇక్కడి ప్రత్యేకత. ఇంచార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కార్పొరేషన్ కమిషనర్ నందన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనురాధ, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### కావలిలో మునిసిపల్ ఉద్యోగులకు క్రీడాపోటీలు

జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి మునిసిపల్ ఉద్యోగులకు ఈనెల 20న కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చెస్, క్యారంబోర్డు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లోని విజేతలకు గణతంత్ర దినోత్సవం రోజున ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేస్తామన్నారు.

### ఆత్మకూరులో రైతులకు ఉచితంగా జింక్ సల్ఫేట్

ఆత్మకూరు మండలంలో వ్యవసాయ అధికారులు ఈనెల 19న పంటభూముల్లో భూసార పరీక్షలు నిర్వహించారు. జింక్ శాతం లోపించిన భూములు సారవంతమయ్యేందుకు 642 మంది రైతులకు జింక్ సల్ఫేట్‌ను ఉచితంగా అందజేశారు. ఆత్మకూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో వ్యవసాయాధికారి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### చిలకలమర్రిలో ప్రజాకవి వేమన జయంతి

అనంతసాగరం మండలం చిలకలమర్రి ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 19న ప్రజాకవి వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన పద్యాలపై విద్యార్థులకు పోటీలు పెట్టి, విజేతలకు బహుమతులిచ్చారు. ఉపాధ్యాయులు శివ శంకరయ్య, చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, వేమన ఫౌండేషన్ వారు పాల్గొన్నారు.

### మనుబోలు వద్ద.. రైలుకింద పడి వృద్ధుని మృతి

మనుబోలు-కొమ్మరపూడి రైల్వేస్టేషన్‌ల మధ్య ఈనెల 20న రైలుకింద పడి ఓ 60 ఏళ్ళ వృద్ధుడు మరణించాడు. తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, కాఫీకలర్ నిక్కరు ధరించి ఉన్నాడని, ఘటనాస్థలంలో ఆయన మరణానికి సంబంధించి ఆధారాలు దొరకలేదని రైల్వే ఎస్ఐ హరిచందన తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

### రాజువారి చింతలపాలెం వద్ద ఆటోబోల్తా.. 13 మందికి గాయాలు

కావలి మండలం రాజువారి చింతలపాలెం గ్రామం వద్ద ఈనెల 20న జరిగిన రోడ్డుప్రమాదంలో ఆటో బోల్తాపడి, కూలిపనులకు వెళ్తున్న 13 మందికి గాయాలు తగిలాయి. ఆటో డ్రైవర్ పరారు కాగా, స్థానికులు 108 అంబులెన్స్‌కి సమాచారం అందించారు. గాయపడిన వారిని కావలి ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్సలు చేస్తున్నారు.

### విరువూరులో 'పొలం పిలుస్తోంది'

పొదలకూరు మండలం విరువూరులో ఈనెల 20న వ్యవసాయ అధికారి వి.ప్రతాప్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించి, రైతులకు వరిసాగులో మెళకువలు తెలిపారు. పంటపొలాల్లో ఎలుకల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యవసాయశాఖ అధికారులు రాజమోహన్‌రెడ్డి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వెంకట్రావుపల్లిలో.. 104 వాహనం ద్వారా వైద్యసేవలు

ఉదయగిరి మండలం వెంకట్రావుపల్లిలో ఈనెల 20న గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఎం.శివకల్పన ఆధ్వర్యంలో 104 వాహనం ద్వారా 48 మంది గ్రామస్తులకు వైద్యసేవలు అందజేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 104 వాహనం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### కొమ్మలపూడిలో తహశీల్దార్ సమావేశం

మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈనెల 20 తహశీల్దార్ రమాదేవి గ్రామస్తులతో సమావేశమయ్యారు. 'వన్ మంత్-వన్ విలేజ్' కార్యక్రమంలో భాగంగా, నెలకు నాలుగుసార్లు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఆమె తెలిపారు. ఆమెకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

# తెలుగుజాతి ఆత్మగౌరవ పతాక..ఎన్టీఆర్!

## • నందమూరికి నెల్లూరు నేతల నివాళి

*తెలుగుజాతి పౌరుషానికి ప్రతీకగా..తెలుగోడి ఆత్మగౌరవానికి పతాకగా నిలిచిన దివంగత మహానేత నందమూరి తారక రామారావు కారణజన్ములని, పేదలకు ఆయన ఆత్మబంధువని, ఎన్టీఆర్ వంటి నేతలు ఎంతో అరుదని నెల్లూరు నేతలు కొనియాడారు. ఈనెల 18న ఎన్టీఆర్ 30వ వర్ధంతి కార్యక్రమాలు జిల్లావ్యాప్తంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకునిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలను నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు.*

### సంక్షేమ పథకాలకి ఆద్యులు ఎన్టీఆర్

**- మంత్రి ఆనం**



పొంగూరు గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆనం

ఎన్టీఆర్ అనే మూడు అక్షరాలు ఒక ప్రభంజనమని, సంక్షేమ పథకాలకు, సాగు నీటి ప్రాజెక్టులకు ఆయన ఆద్యులని రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం పొంగూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్ అంటే ఒక వ్యక్తి కాదని, ఒక శక్తి అనీ అన్నారు.

### యుగపురుషుడు ఎన్టీఆర్

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి**



నరుకూరులో నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు మండలం నరుకూరులో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్టీఆర్ అంటే రాముడని..కృష్ణుడని..యుగపురుషుడని కొనియాడారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కిలో రూ. 2కే బియ్యం, రూ. 30 పింఛన్, మండల వ్యవస్థ, సింగిల్ విండో సిస్టమ్, వడ్డీ రేట్ల తగ్గింపు, మహిళలకు ఆస్తి హక్కు తదితర ఎన్నో సంచలనాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు.



తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితర టీడీపీ నాయకులు

నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో మంత్రి డా. నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమునిగానే కాక, తెలుగు ప్రజలకు, అభిమానులకు ఆరాధ్యదైవంగా ఎన్టీఆర్ ఎప్పటికీ ప్రజల హృదయాల్లో నిలిచే ఉంటారని ఆయన అన్నారు ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించగా, 3వందల మందికి పైగానే కార్యకర్తలు, యువత పాల్గొని రక్తదానం చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, తాళ్లపాక అనూరాధ, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కారణజన్ములు ఎన్టీఆర్

**- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర**

నెల్లూరు నగరంలోని నర్తకి సెంటర్ వద్ద అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు తాళ్లపాక రమేష్‌రెడ్డి – అనురాధ దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు, టిడిపి నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు బీద రవిచంద్ర పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలకు ఆద్యుడుగా, బడుగువర్గాల పాలిట దేవుడుగా ఆయన ప్రజల ప్రశంసలందుకున్నారని, ఆయన కారణజన్ములని అన్నారు.

## 'ఆధ్యాత్మికతతో కర్తవ్య నిర్వహణ'పై..

# శ్రీసిటీలో అవగాహన

### ఆకట్టుకున్న ప్రముఖ తత్వవేత్త వినయ్‌జీ ప్రసంగం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ప్రముఖ తత్వవేత్త వినయ్‌జీ

శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి, హైదరాబాద్‌కు చెందిన విజ్‌డమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఆధ్యాత్మికతతో కర్తవ్య నిర్వహణ' అనే అంశంపై బుధవారం ఉదయం శ్రీసిటీలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ తత్వవేత్త వినయ్‌జీ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. పలువురు పరిశ్రమల ఉద్యోగులు, విద్యావేత్తలు, స్థానిక ప్రజలు పాల్గొని ఆధునిక జీవనంలో ఆధ్యాత్మికత ఆవశ్యకతపై అవగాహన పొందారు. వినయ్‌జీ తన ప్రసంగంలో, భగవద్గీత ఆధారంగా ఆధునిక ఉద్యోగ జీవనంలో ఆధ్యాత్మికత ప్రాముఖ్యతను వివరించారు. ఫలితాలను ఆశించకుండా కర్తవ్య నిర్వహణ చేయడం, జయాపజయాల పట్ల నిశ్చల భావన కలిగి ఉండటం ద్వారా, మనం చేసే పని మరింత అర్థవంతంగా మారుతుందని తెలిపారు. కర్మయోగం ద్వారా నైతిక నాయకత్వం, ఆత్మ నియంత్రణ, మానసిక స్థైర్యం సాధ్యమవుతాయని వివరించారు. నిరర్థక విషయాలపై దృష్టి పెట్టకుండా, జాగరూకతతో కార్యాచరణను ఆచరించాలన్నారు. తమ ఆహ్వానం మేరకు శ్రీసిటీకి వచ్చి మార్గదర్శకమైన ప్రసంగం చేసిన వినయ్‌జీకి శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం పరిశ్రమల వర్గాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. స్థానిక బీరోలెక్స్ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వై.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీకి అండగా..

# సీఎస్ఆర్ నిధులివ్వాలి

### జోనల్ చైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



మాట్లాడుతున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

ఆర్టీసీలో మౌలిక సదుపాయాల కల్పనకు, ఉన్న వసతులు మెరుగుపరిచేందుకు జిల్లాలోని ప్రముఖ సంస్థల వారు అండగా నిలిచి సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కోరారు. ఈ నెల 20న నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లో ఆయన కార్మికులకు అవసరమైన వస్తుసామగ్రిని పంపిణీ చేశారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో 22 ఫ్యాన్లు, దాత ఆల్తూరి మహేష్‌రెడ్డి వితరణతో 80 డస్ట్‌బిన్లు, 33 మాప్రాన్లుతో పాటు, 80మంది కార్మికులకు అవసరమైన కళ్ళద్దాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ మురళీనాయక్ మాట్లాడుతూ, ఆర్టీసీతో ఎస్‌బీఐకి ఒప్పందం ఉందని, కార్పొరేట్ జీతాల ప్యాకేజీ కింద ప్రతి కార్మికునికి వారి జీతాలను అనుసరించి తగు ప్రమాద బీమా వర్తిస్తుందని తెలిపారు. రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ జనార్దన్‌రాజు, జిల్లా ప్రజా రవాణా అధికారి షమీమ్, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రమేష్, డిపో మేనేజర్లు వెంకటేశ్వర్లు, కరీమున్నిసా తదితరులు పాల్గొన్నారు.


తృతీయ వర్ధంతి



జననం 24.10.1931

నిర్యాణం 25.01.2023

అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి

శ్రీమతి పెనాక లక్ష్మీనారాయణమ్మ గారు

(లేట్ పెనాక రమణారెడ్డి గారి సతీమణి)

స్వర్గస్తురాలై తేది. 25.01.2026 నాటికి మూడేళ్ళు గడవనున్న సందర్భంగా ఆమె దివ్యస్మృతిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు

పెనాక రామ్‌ప్రసాద్‌రెడ్డి

వ్యవస్థాపకులు, అరబిందో ఫార్మా లిమిటెడ్

పెనాక గోపీనాథ్‌రెడ్డి

కుమార్తెలు

బొమ్మా సరళ

తోటపల్లి రమాదేవి

మరియు

కుటుంబసభ్యులు

మనుమళ్ళు

పెనాక శరత్‌చంద్రారెడ్డి

పెనాక రోహిత్‌రెడ్డి

పెనాక రామ్‌ధీరజ్‌రెడ్డి

పెనాక రాహుల్‌దీపక్‌రెడ్డి


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com